# పూలసజ్జ

కాళూరి వేంకటరామారావుగారు

## తొలిపుష్పము: తోటమాలి జగ్గయ్య

జగ్గయ్య చిన్నతనములోనే ధర్మవరదుర్గమున తోటమాలిగా ప్రవేశించినాడు. వ్యవహారసందర్భముల యందు ముక్కుసూటిగా పోవు స్వభావముగల మనిషి. అతనిసుగుణపుంజములును, స్వామిభక్తియును, అన్నిటికంటె మిన్నగ నతని నిత్యప్రసన్నవదనమును అతడు సేవించుచున్న జమీందారులదృష్టి నాకర్షించినవి. రాజకుటుంబములోనివారందరికిని జగ్గయ్య ప్రాణసమానుడు. విద్యాభ్యాసమును ముగించి, అనుభవము కొరకు ధర్మవరజమీందారు విదేశయాత్ర సలిపినప్పుడు జగ్గయ్యనుగూడ తనపరివారములో నొకనిగా నిర్ణయించినాడు. విదేశయాత్రావసరమున జగ్గయ్యప్రవర్తన ప్రభువునకు పూర్ణసంతృప్తిని కలిగించినది. "జగ్గయ్య స్వామిభక్తికిని, సేవాపరాయణతకును తగినరీతిని బహూకరించుటయెట్లు"ను ఆలోచన జమీందారునకు కలిగినది. ధర్మవరదుర్గమున కనతిదూరముననే జమీందారునకొక గొప్పతోటయుండెను. అందొక విశాలమగు దివ్యభవనమున్నది. తోటలో నివసించి యచ్చటి హర్మ్యమును జాగ్రతగచూచుబాధ్యత జగ్గయ్య కప్పగించబడినది. జనసంకీర్ణములగు నగరములయెడ విముఖుడైన జగ్గయ్య సరిగా అట్టిప్రశాంతప్రదేశమునే కోరియుండెను. ఏవిధమగు శిస్తునుగాని చెల్లించనవసరము లేకుండ నాతోటస్థలమంతటిని జగ్గయ్య జీవితకాలమంతయును అనుభవించుటకు ఉదారహృదయుడగు జమీందారు నిర్ణయించెను. అతని కుటుంబమునకు సరిపడుధాన్యమును దయచేయుటకుగూడ ప్రభువు వాగ్దానమొనర్చెను.

జగ్గయ్య అల్పసంతోషి. తనఆస్తిని చూచుకొని కనకాభిషేకమును పొందినట్టుగా సంతసించినాడు. ధర్మవరకాపురస్థుడగు నొకసంపన్నకాపుగృహస్థుని కుమార్తెను వివాహముచేసుకున్నాడు. ఐహికసౌఖ్యములకు సంబంధించినంతవరకును అతనికేలోపమును లేకుండచేసుకున్నాడు. జగ్గయ్య జీవితమిప్పుడు శాంతియుతముగ గడచిపోవుచున్నది. సూర్యోదయాత్పూర్వము లేచి చీకటిపడువరకును అతడు కష్టపడి పనిచేసుకొనుచుండెను. తోటలోసగమువంతుభూమిలో మాత్రమే ఫలవృక్షములుండెను. మిగిలిన సగభాగమును కాయకూరలకొరకు విడిచిపెట్టబడినది. సుగుణవతియును, అనుకూలవతియును అగుభార్యతో జగ్గయ్య చిరకాలము సుఖజీవితమును గడిపినాడు. ఇంతలో మృత్యుదేవత ఆమెను కబళించివేసినది. సహచారిణిని గోలుపోయి జగ్గయ్య దుఃఖసముద్రమున క్రుంగిపోయెను. వృద్ధాప్యమును, పత్నీవియోగమును ఒక్కసారిగానే దాపరించుటచేత జగ్గయ్య మరింతలొంగిపోయినాడు. కలిగినసంతాన మందరికిని ఒక్కకుమార్తెమాత్రమతనికి మిగిలినది. తల్లిచనిపోవుసరి కామెకైదుసంవత్సరములవయస్సు కలదు. తల్లిపేరు కలిసివచ్చేటట్లామెకు "సూర్యకాంతం!" అని జగ్గయ్య నామకరణముచేసినాడు. కాని "కాంతం" అనియు, "కాంతమ్మ" అనియు నతడు మామూలుగా పిలుచుచుండెను. కాంతమ్మ మాటుమూర్తులను తల్లిపోలిక. చిన్నపిల్లప్పుడే కాంతమ్మ చూడతగిన అందముగలిగియుండెను. క్రమముగా సంవత్సరములు పైబడినకొద్ది దైవభక్తియు, అమాయకత్వమును, దయార్ద్రహృదయమును ఆమెసౌందర్యమునకు వింతవన్నె సమకూర్చినవి. పదునైదుయేండ్లయినను నిండకపూర్వమే కాంతమ్మ గృహకృత్యములను సర్దుకొనుట ప్రారంభించినది. జగ్గయ్యయిల్లు పరిశుభ్రతకునిలయమై, చుట్టుప్రక్కల గృహములన్నిటికంటె చూడతగి ఉండెడిది. ఇంటిపనులలో మాత్రమేకాక ఆమెతరుచుగా తోటపనిలోగూడ తండ్రికి సహాయపడుచుండెడిది. ఈరీతిగా జనకునితో గడిపినగడియలే ఆమె జీవితమున సౌఖ్యతమమైనవిగానుండెడివి. జ్ఞానవివేకములచేత జగ్గయ్యమనస్సు పరిణతినిపొందినది. అందుచేత అతని సంభావన

లాకర్షణీయములై, జ్ఞానదాయకములై పనియందలి భారమును తోపనీయకుండెను. తోటలోని పూలమధ్యనే కాంతమ్మ పెరిగినదని చెప్పవచ్చును. పూలతోట వేసుకొనుటకు తోటలో కొంతభూమిని కుమార్తెకు జగ్గయ్య ప్రత్యేకముగా యిచ్చివేసినాడు. ప్రతిసంవత్సరమును క్రొత్తక్రొత్తరకముల పూలచెట్లను ఆమెకొరకు తెచ్చి పెట్టెడివాడు. వాటిని వాటి బహుప్రేమతో ఆమె పెంచుకొనుచుండెడిది. తీరుబాటుగానున్న ప్రతి నిముషమును ఆమె తోటలోనే గడుపుచుండెను. ఆమెకు తోటపనియే అన్నిటికంటెను ఎక్కువ అహ్లాదకరముగా తోచినది.

పుష్పములయందు కుమార్తెకుగల గాఢానురాగమునకు జగ్గయ్య మిక్కిలి సంతసించినాడు. ఆ ఉత్సాహమును సమున్నతాదర్శములవంకకు మరల్చుటయెట్లో అతనికి తెలుసు. కుసుమముల ప్రవిమలసౌందర్యమునందును, సహజాకర్షణశక్తియందును సర్వేశ్వరుని సౌజన్యతను, ధీవిలాసమును గమనించవలెనని అతడామెకు బోధించుచుండెను. కరుణామయుడగు సర్వేశ్వరుని ధ్యానించుటకు దినమంతటిలోను అర్థఘంటకు, మొకపావు గంటయైనను వినియోగించలేనిజీవనము నిరర్థకమని అతనితలంపు. ప్రేమపూరితహృదయుడును, జ్ఞానియునైన జనకుని సంరక్షణలో, మనోహరపుష్పసమూహములమధ్య కాంతమ్మ దినదినప్రవర్ధమానయగుచుండెను. వికసియ బూచిన వృక్షమునందువలె ఆమెయందభివృద్ధిసూచనలు కనిపించుచుండెను.

## రెండవ పుష్పము : జన్మదినోత్సవము

జగ్గయ్యయింటికి సమీపముననే ఒకచిన్నఅడవియుండెను. ఒకనాటిఉదయము కాంతం ఆఅడివిలోనికి పోయినది. తోటలోపనిలేని తీరికసమయములందు జగ్గయ్య అడవితీగలతో పూలసజ్జలనల్లుచుండును. తండ్రికొరకు తీగలనుకోసితెచ్చుటకై ఆమె అప్పుడప్పుడు అడివిలోనికివెళ్లుమామూలుకలదు. పోయిపోయి కాంతం ఒకలోయలోనికివెళ్లినది. ఆలోయ అనేకరకముల అడవిపువ్వులతోనిండి మనోహరమైయుండెను. చిన్నచిన్నకొండవాగులులెక్కలేనన్ని వానికిదోహదమొసంగుచుండెను. ఆపువ్వులనుచూచి ఉత్సాహపూరితురాలైనది కాంతం. ఇన్నిపువ్వులుకోసి తనకొకటియును, తండ్రికొకటియును రెండుదండలు తయారుచేసినది. అడివిలోపనిపూర్తిచేసుకుని ఆమె యింటిదారిపట్టినది. జమీందారులకోట వెనుకభాగమునుసమీపించుసరికి జమీందారిణియును ఆమెకుమార్తెయును అచ్చటి ఉద్యానవనవిహారమొనర్చుచు నామెకుకనబడిరి. శ్రీమంతులగువారలను చూచినవెంటనే కాంతం వినయపూర్వకముగ నమస్కరించినిలుచుండెను. ఆమెచేతులోనున్న పూలదండలను వారిద్దరునుచూచిరి. "ఎంతఅందంగావున్నాయి పువ్వులు! ఇవన్నీఅడివిలోనివే?" అని జమీందారువారికుమార్తె అడిగింది. తక్షణమేనమ్రతతో కాంతం వారిద్దరికిని చెరియొకదండను సమర్పించినది. వారాదండలను సంతోషపూర్వకముగనందుకొనిరి. బంగారుజరీపట్టుసంచినుండి కొంతధనమునుతీసి జమీందారిణి కాంతమ్మ కియ్యబోయినది.

"అమ్మా! ఆపువ్వులకోసం నేను తమకద్దడబ్బుపుచ్చుకోనా? ఎంతమాట! తమవల్ల అనేకమహోపకారాలనుపొందిన జగ్గయ్యకుమార్తెను నేను. తమ ఉప్పుతిన్నందుకీదండలను ఏప్రతిఫలమూకోరకుండానే తమకుసమర్పించడానికి పేదపిల్లకవకాశమియ్యవలెనని ప్రార్థిస్తున్నాను" అని కాంతం వినయముట్టిపడునట్లుగా చెప్పినది.

ఆమె సౌజన్యతకుజమీందారిణి సంతోషితురాలైనది. సస్నేహముగా నామె "అలాగా! జగ్గయ్య కూతురవానువ్వు? నీకుతీరుబాటుసమయాల్లో యిలాంటిదండలుకట్టి అప్పుడప్పుడు తీసుకొస్తూవుండు. మా అమ్మాయికియిలాంటివంటే చాలాసరదా" అన్నది.

కాంతం అంగీకారమును సూచించినది. అదిమొదలామె తరుచుగాపూలదండలుకట్టి కోటలోనికితీసుకొనివెళ్లుచుండెను. ఆకారణమున జమీందారువారి కుమార్తెయగు "అమలాంబ"తో కాంతమ్మకు బాగాపరిచయముకలిగినది. అమలాంబముద్దుపేరే "అమ్మాజీ". అమ్మాజీకి కాంతంపైనిగల ప్రేమ దినదినాభివృద్ధినిపొందినది. ఆడంబరరహితమగు నామె నడవడికనుచూచి అమ్మాజీమెచ్చుకున్నది. తరుచుగా కోటలోనికితనవద్దకు వచ్చుచుండవలెనని ఆమె కాంతమ్మనుకోరినది. ఇంతలో అమ్మాజీ జన్మదినోత్సవముసమీపించినది. ఆసందర్భమున ఆమెకేదైనను కానుకగాతీసుకొనివెళ్లుట భావ్యమని కాంతమ్మనిశ్చయించుకున్నది.

పూలసజ్జలల్లుటయందు జగ్గయ్యబోలు నేర్పరిలేడని చెప్పవచ్చును. కుమార్తెకోసమని అతడు తనపనితనమంతయు వినియోగించి ఒకచక్కనిసజ్జనుఅల్లెను. తోటలోని ప్రశస్తములైనపువ్వులతో నాసజ్జనునింపి దానిని జన్మదినోత్సవసమయమున బహుమానముగా అమ్మాజీకియియ్యవలెనని కాంతం అభిప్రాయము. కుమార్తె ఆలోచనకు జగ్గయ్యసమ్మతించినాడు. ఇంకొకగంట తీరుబడిచేసుకుని సజ్జకువన్నెచిన్నెల నేర్పరించిరెట్టింపు అందముతో కనబడునట్లుచేసినాడు. ఎర్రరంగుతీగలతో సజ్జపైని "అమ్మాజీ" నామాక్షరములను గూడ అల్లినాడు. జన్మదినమాసన్నమైనది. ఉదయముననేలేచి తోటఅంతటనువెతికి అన్నిజాతులపుష్పములను ఏంచి ఏంచి కాంతం కోసుకొనివచ్చినది. రంగురంగుల ఆకులుకలరెమ్మలనుగూడ వీరుకున్నది. అపరిమితకళాకౌశలముతో నామె పూవులను రెమ్మలను సజ్జలోనమర్చినది. సజ్జచుట్టును పసుపుపచ్చని చేమంతిపూలదండనుచుట్టినది. "అమలాదేవి" అనుపేరు గులాబీలతో అల్లబడినలతలమధ్య స్పష్టముగకనబడుచుండెను. కుమార్తెకళాకౌశల్యమునకు జగ్గయ్య ఆశ్చర్యభరితుడైనాడు. మందహాసముతో "కాంతం! ఒక్కనిముషం ఆసజ్జని అలాగే వుంచు. మరికొంచెంసేపు చూడాలనివుంది. ఎంతచూసినా తనివితీరడంలేదు"అని సంతృప్తిని వెల్లడించినాడు.

తరవాత సజ్జనుపట్టుకుని కాంతం కోటలోనికిపోయినది. హృదయపూర్వకాభినందములతో సజ్జను అమ్మాజీకి సమర్పించినది. ఆసమయమున అమ్మాజీ ముస్తాబు అగుచుండెను. దాసియగుపున్న ఆమెకుజడవేయుచుండెను. అపరిమితానందముతో అమ్మాజీ బహుమానమును గ్రహించినది. ఆమనోహరకళాకౌశల్యమును శ్లాఘించుటకామెకు భాషాసామర్థ్యముచాలకపోయినది. ఆమెయిట్లన్నది: "కాంతం! నామీదనీకంత ప్రేమ? నాకీయమూల్యబహుమానమును చెయ్యడానికి తోటలోని మంచిపూవులన్నీకోసేశావనుకొంటాను. ఈసజ్జయెంతఅందంగావుంది! ఇలాటిది నేనిదివరకెన్నడూచూడలేదుసుమా! దా! మాఅమ్మకి చూపిద్దాం."

సస్నేహముగా కాంతమ్మచేయిపట్టుకుని అమ్మాజీ మేడమీదికి తీసుకొనివెళ్లినది. తల్లిగదిలోనికివెళ్లిన పిమ్మట "అమ్మా! కాంతం నాకోసమెంతచక్కని బహుమతితెచ్చిందోచూడు. ఈసజ్జలాటిదాన్నినువ్వెన్నడైనా చూశావా? పువ్వులెంత అందంగాఉన్నాయో!" అన్నది.

సజ్జనుచూచి జమీందారిణిగూడ సంతసించినది. "కాంతం! యిప్పుడేకోసిన యీపువ్వులెంతసొగసుగావున్నాయి! ఈపువ్వులఅమరిక నీకళాభిరుచిని వేనోళ్ల చాటుతున్నాయి. అన్నిటికంటే ఎక్కువగా ఈబహుమానము నీసౌహార్దమును తెలుపుతుంది. కాంతం! ఒక్కనిముషమీగదిలోనేఆగు. యిప్పుడేవస్తాను." అనిచెప్పి ఆమె అమ్మాజీని తనతో ప్రక్కగదిలోనికిరమ్మని సౌజ్ఞచేసినది. వేరొకగదిలోనికి పోయినతరువాత జమీందారిణి కుమార్తెనుచూచి "అమ్మాజీ! తగినప్రతిఫలంలేకుండా మనం కాంతాన్నిపంపకూడదు. మనం యేమిస్తేబాగుంటుందని నీఅభిప్రాయం?" అనిఅడిగినది.

అమ్మాజీ ఒక్కనిముషమాలోచించి "నాచీరలలోది ఒక్కటిస్తేబాగుంటుందనుకుంటాను. మనంవెనుక కొన్న జరీపువ్వుల సిల్కుచీరయిమ్మంటావా? నేనుదాన్ని ఒకటిరెండుసార్లుమాత్రంకట్టుకున్నాను. ఇంకా కొత్తరంగుమాయనేలేదు. ఆచీర కాంతం వొంటిమీదబాగుంటుంది. నీకిష్టమైతేసరి. యిచ్చేస్తాను."అన్నది.

"సరే! అలాగే చెయ్యి. ఏవస్తువు బీదవాళ్లకిచ్చినా ఉపయోగకరమైనదే యివ్వాలి. నువ్వు చెప్పిన చీర యిచ్చేయ్యి. బాగానేవుంది."

వారిద్దరూ తిరిగీ కాంతం నిలుచున్న గదిలో ప్రవేశించినారు. అప్పుడు జమీందారిణి "అమ్మాజీ! ఇక వెళ్లండి. పువ్వులు బహుభద్రమునుమండీ. వాడిపోతాయి జాగ్రత్త! దాన్ని హాలులో మేజామీద పెట్టించు. అతిథులంతా చూసి ఆనందిస్తారు. కాంతం! నువ్వు అమ్మాజీతో కూడా వెళ్లు" అన్నది.

అమ్మాజీ కాంతమ్మను తనగదిలోనికి తీసుకొనిపోయి దాసినిపిలిచి చీరను తెమ్మని చెప్పినది. పున్న ఆమె వైపు నిలకడగా చూచుచు నిలబడి "ఇప్పుడదెందుకమ్మా! మీరా చీర కట్టుకుంటారేమిటి యీవేళ?" అని అడిగినది.

"ఆగోడవంతా నీకెందుకు? తీసుకురా! దాన్ని కాంతానికి బహుమానం చెయ్యదలచుకున్నాను."

"ఆ—! ఆచీరే యిచ్చేయడం? అమ్మగారెరుగుదురా యీసంగతి?"

"అదంతా నీకెందుకూ? ముందు తీసుకురా! ఏం? వెళ్లవేం?"

పున్న ముఖం చిట్లించుకుని వెళ్లిపోయినది. పెద్దచప్పుడుతో బీరువాతలుపులాగి చీరను దీసినది. కోపము చేత ఆమె శరీరము మండుకొనిపోవుచుండెను. "న్యాయరీత్యా యీచీర నాకు రావలసినది. నాప్రాణానికి యిదెక్కడ దాపరించినది? దీనిగుడ్లు తీసెయ్యా! ముందొచ్చిన చెవులకంటె వెనకొచ్చిన కొమ్ములకు వాడియెక్కువట! కానీ! చూద్దాం. దీనిపనిపట్టేస్తాను. సమయం రాకపోతుందా?" అని యీర్ష్యాపరవశురాలగు పున్న అనుకున్నాది.

లేనినవ్వు తెచ్చుకుని పున్న చీరతో కూడా గదిలో ప్రవేశించినది. అమ్మాజీ చీరను పట్టుకొని "కాంతం! ఈరోజున ఎన్నో బహుమతులొచ్చేయి. కాని నీవిచ్చిన సజ్జ కలిగించిన ఆనందము యింకొకటి కలిగించలేకపోయినది. ఈచీరమీదనున్న బంగారుజరీపువ్వులు కూడా నీసజ్జలో పువ్వులంత అందంగాలేవు. అయినా నాయందుగల ప్రేమచేత ఈచీరను నీవు అంగీకరిస్తావనే నమ్ముతాను. నువ్వు దీన్ని కట్టుకోగా చూడాలనివుంది. నా క్షేమపూర్వకాభివందనములను జగ్గయ్యకి తెలియపరుచు" అని అమ్మాజీ చీరనూ వేరొకరవికనూ కాంతమ్మకిచ్చివేసినది.

కాంతం వానినందుకుని అమ్మాజీహస్తాన్ని ముద్దుపెట్టుకుని నిండారు సంతసముతో నింటికిపోయినది.

పున్నకు అసూయాదుఃఖములు రెండును పొర్లిపోయినవి. ఎంత ప్రయత్నించినను ఆమె కోపమును అణుచుకొనలేకపోయినది.

"ఏం పున్నా? అంతకోపంగావున్నావీవేళ?" అని అమ్మాజీ అడిగినది.

"అమ్మా! తమరు ధర్మకార్యాలు చేసేటప్పుడు నాకు కోపం యెందుకూ?"

"బాగా చెప్పేవు. నీకలాటిభావాలువుండడం మంచిదని నా అభిప్రాయం".

అమ్మాజీ జన్మదినోత్సవసందర్భమున కోటలో గొప్పవిందుజరిగినది. బంధుమిత్రసామంతులందరును ఆహ్వానింపబడిరి. బ్రహ్మాండమైన ప్రయత్నములు జరిగినవి. అతిథులందరును వచ్చి అక్కడి వినోదములలో పాల్గొనుచుండిరి.

జనకునితో తన అదృష్టమునుగురించి చెప్పడానికి కాంతం తొందరగా తోటలోనికి వచ్చినది. కాని దూరదృష్టిగల జగ్గయ్య అంతవిలువగల బహుమానము చూసి ఆనందించు పద్ధతిలో మనిషి కాడు. నెరిసిన తలను పంకించుచు అతడు కుమార్తెతో "కాంతం! బాగా ఆలోచించగా నువ్వా సజ్జను కోటలోనికి తీసుకెళ్లడమే నామట్టుకు సమ్మతంకాలేదు. కాని యిప్పుడేం చెయ్యగలం? మించిపోయినదానికి విచారమెందుకూ? ప్రభు

365

వులు మనకీబహుమతిని దయచెయ్యడం మనంధన్యులమే. కాని యిందుమూలాన్ని మనపైనియితరులు అకారణంగా అసూయాగ్రస్తులపడానికి అవకాశము కలుగుతుందేమోనని నాభయం. నీహృదయంలో గర్వానికి తావుదొరుకుతుందేమోనని మరింతభీతిల్లుతున్నాను. అమ్మా! ఏదియెలాగున్నా గర్వానికిమాత్రం నీలో తావియ్యకూడదు. సత్ప్రవర్తనమే స్త్రీలకాభరణము. చీనిచీనాంబరములును, రత్నభూషణములును సత్ప్రవర్తనముందు కానుకుకోరగావు. ప్రశాంతజీవనమునకదియే ఆధారము. సర్వేశ్వరునిదృష్టియందు దానికేవిలువ అధికము" అని ముచ్చటించినాడు.

## మూడవ పుష్పము : ఉంగరము

కాంతం చీరకట్టుకుని చూచినది. వెంటనే మరలవిప్పివేసి జాగ్రత్తగామడతపెట్టి పెట్టెలోపెట్టినది. అంతలోనే అమ్మాజీ అతిఆయాసముతో వగర్చుకొనుచుపరుగెత్తుకుని అక్కడకువచ్చినది. ఆమెముఖము వెలవెలబోవుచు భయమును సూచించుచుండెను. ఆమె ఆపాదమస్తకమును ప్రకంపితమైపోవుచుండెను.

జమీందారునిముద్దుబిడ్డ అంతహడావుడిగా వచ్చుటకు కారణమును కాంతమ్మ ఊహించలేకపోయినది. ఇంకాకాంతం మాట్లాడకముందే ఆత్రముతో అమ్మాజీయిట్లనెను: "కాంతం! ఎంతపనిచేశావు! మా అమ్మవజ్రపుటుంగరం కనబడలేదు. ఆసమయాన్ని అమ్మగదిలో నీవుగాక వేరొకరులేరు. అయ్యో! నాచేతికి వెంటనే యిచ్చెయ్యి. లేకపోతే గొప్పప్రమాదంరావడానికి సిద్ధంగావున్నది. వుంగరం నాచేతికిచ్చెయ్యి. ఏంపరవావుండదు".

ఈమాటలువినుసరికి కాంతం నిలువునునీరువిడిచిపోయినది. ఆమెమాటలయందు వణుకుపుట్టినది. "అమ్మా! ఇదేమిటో నాకుబోధపడలేదు. నేనేవుంగరమూయెరగను. నేనుగదిలో వుంగరాన్నిచూడనైనా చూడలేదు. నిలబడ్డచోటునుంచి ఒక్కఅడుగైననూకదల్లేదు." అని చెప్పినది.

కాని అమ్మాజీకి ఆమాటలుచెవికెక్కలేదు. ఆమె మరలచెప్పుటకు ప్రారంభించినది. "కాంతం! నేను నీకోసమనేయింత నొక్కినొక్కిచెబుతున్నాను. ఆవుంగరం యెంతవిలువకలదో నీకుతెలియదు. అధమపక్షం పదివేలరూపాయలకు తక్కువవుండదు. నీకాసంగతితెలుస్తేఅల్లాతీసివుండవని నాఅభిప్రాయం. ఏదో తక్కువ ఖరీదుకలవస్తువుకదా అని తీసివుంటావు. తక్షణం దాన్నినాకిచ్చివేయమని మరీమరీకోరుతున్నాను. నీకేబాధారాకుండా చూసేపూచీనాది. అందుకేగదూ నేనుస్వయంగా పరుగెత్తుకొచ్చాను?".

కాంతమ్మకి దుఃఖముఆగలేదు. "అయ్యో! నాకు ఆవుంగరం సంగతియేమీ తెలియదు. ఇతరులవస్తువు నెన్నడూముట్టుకునైనాయెరగను. దొంగిలించి అసలేయెరగను. అల్లాంటినీచపుపని చెయ్యడానికి నామనసెన్నడూ వొప్పుకోలేదు." అన్నది.

ఆసమయమున జగ్గయ్య లోపలప్రవేశించినాడు. అమ్మాజీ తొందరగా లోపలకుప్రవేశించునపుడు అతడు తోటపనిచేసుకొనుచుండెను. కారణమేదియోకనుగొనవలెనని అతడు లోపలకువచ్చినాడు. కాని సంగతంతా తెలిసినతరువాత నిలబడలేకపోయినాడు. అతనితల గిర్రున తిరిగిపోయినది. మెల్లగ గోడనుబట్టుకొని నేలను కూలబడిపోయినాడు. ఇంచుక శక్తితెచ్చుకొని జగ్గయ్య యిట్లుపలికెను. "అమ్మా! కాంతం! ఇంతవిలువగలవస్తువను దొంగిలించినందు కీరోజుల్లో బహుకఠినశిక్ష విధిస్తారు. అయినా వ్యవహారం యింకా మనచెయ్యిదాటిపోలేదు. ఈపనివల్ల ఒక్కనరులకేగాక సర్వసాక్షియగు భగవంతునికికూడా జవాబు చెప్పవలసినదానవవుతావు."

—మిగిలివున్నది.

# పూలసజ్జ

కాళూరి వేంకటరామారావుగారు

కాంతం ముఖము చెరువగునట్లేడ్చుచుండెను. "బాబూ! వుంగరంసంగతే నాకు తెలియదు. ఒకవేళ నాకలాటివస్తువ వీధిలో దొరికినా స్వంతదారుణ్ణి కనుక్కుని దాన్ని వారికందచేసేవరకూ నాకు నిద్రపట్ట దన్నసంగతి నువ్వెరగవా? అయ్యో! నేనేమీయెరగను" అన్నది.

ఆమెమాటలు వినకుండనే జగ్గయ్యచెప్పుచుండెను. "ఈతల్లి, అగర్భశ్రీమంతుని ముద్దుకుమార్తె నీపై గల ప్రేమాతిశయంచేత, పోలీసులబారినుండి నిన్నురక్షించడానికి స్వయంగావొచ్చింది చూశావా? ఇప్పుడే కదా నీకీమె అయమూల్యమగు బహుమానమునిచ్చింది! అట్టి సహృదయురాలియెదుట నీవు అసత్యమాడడం న్యాయంకాదు. అల్లాచెయ్యడం నీవినాశమునకే అనినమ్ము. నీదగ్గరవుంగరంవుంటే తక్షణంయిచ్చెయ్యి. దయార్ద్రహృదయయగు అమ్మాజీ నిన్నుశిక్షనుండి తప్పించిరక్షించగలదు. కాంతం! నిజంచెప్పు." మరల జగ్గయ్య చెప్ప మొదలుపెట్టెను. "అమ్మా! వయోవృద్ధుడనైన నన్నుచూడు. అవసానదశలో నన్ను దుఃఖమున ముంచకు. ఏప్రభూత్తముని పవిత్రసామ్రాజ్యమునందు చోరులకు తావులేదో, ఏప్రభుని దివ్యసాన్నిధ్యమునకు నేను త్వరలోపోనైయున్నానో అట్టి పరమాత్ముని సమ్ముఖమునవున్నట్లుగా వూహించుకుని నిజంచెప్పు. నీ ఆత్మోన్నతికొరకే నిజంచెప్పమని కోరుతున్నాను."

కాంతం నేలమీద మోకాలిపైకూర్చున్నది. ఆమె తనయశ్రుపూరితనయనముల నాకాశమువంకకు మరల్చినది. హస్తము లప్రయత్నముగానే అంజలీకృతములైపోయినవి. నిశ్చలహృదయమున నామెయిట్లు పల్కినది. "నాదగ్గిరవుంగరంలేదని సర్వేశ్వరుడెరుగును. నే నబద్ధమాడినయెడల శాశ్వతంగా నరకకూపము లలో కూలిపోదును గాక!"

కుమార్తె నిర్దోషియని జగ్గయ్యకు యిప్పటికినమ్మకముకలిగినది. అతడు "అమ్మా! నీదగ్గిరవుంగరం లేదని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. పరమేశ్వరుని సమ్ముఖమున అబద్ధమాడడానికి సాహసించలేవు. నీవు నిష్కల్మషురాలవని నమ్మకంగలిగినందుచేత నామనస్సుకికూడా శాంతికలిగినది. నాతల్లీ! నువ్వుకూడా శాంతిపొందు. ఏమీభయపడనక్కరలేదు. ప్రపంచకంలో ఒక్కపాపానికే మనము వెరవవలెను. మరణ శిక్షకిగాని, ఖైదుశిక్షకిగాని మనంభయపడనవసరంలేదు. మనకెల్లాంటి ఆపదలువచ్చినాసరే. తోడిప్రజలు మనలను విడనాడవచ్చునుగాని ఆతండ్రిమాత్రం మనలను పరిత్యజించడు. ఆదయామయుడే మననిర్దోషిత్వ మును ప్రకటితంచేయగలడు. సన్మార్గవర్తనులకు దైవమేశరణ్యము" అని ప్రశాంతగతినిచెప్పినాడు.

నేత్రములందు ప్రత్యక్షమైన అశ్రుబిందువులను తుడుచుకుని అమ్మాజీ చెప్పినది. "జగ్గయ్యా! మీవద్ద వుంగరంలేదని నేనూనమ్ముతున్నాను. కానిపరిస్థితులనుబట్టి ఎల్లాచూసినా వేరొకసమాధానం కుదరడంలేదు. వుంగరంతీసి గదిలో మేజాబల్లపై పెట్టినట్లు మాఅమ్మకి బాగాజ్ఞాపకమే. ఆవెంటనే నేనూకాంతమూ ఆగది లోకివెళ్లినాము. అప్పుడు నేనూ అమ్మా పక్కగదిలోకి వెళ్లవలసివచ్చింది. ఆసమయమందు అమ్మగదిలో కాంతం తప్పవేరెవ్వరూలేరు. నేను మేజాదగ్గిరకి వెళ్లనైనాలేదు. ఆసంగతి కాంతానికేతెలుసును. అంతకు ముందుగాని వెనకగాని ఒక్కపురుగైనా అమ్మగదిలోకివెళ్లలేదు. నేనూ కాంతమూపైకిరానిచ్చి మాఅమ్మ వేరొకచీరకట్టుకుని వుంగరం పెట్టుకొనబోయేసరికి కనబడలేదు. అమ్మస్వయంగా గదిఅంతటా వెతికినది. రెండుమూడుసారులు పూర్తిగావెతికి గదిలోవుంగరంలేదని నిశ్చయపరచుకునేవరకూ అమ్మనన్నుగూడా గదిలో అడుగుపెట్టనియ్యలేదు. కాని లాభంలేకపోయినది. ఇప్పుడు సంగతంతావిన్నావుకదా. అనుమానం యెవరిమీద వుంటుందో నువ్వేచెప్పు."

"అమ్మా! ఆసంగతి చెప్పడానికి వాలరంకాదు. ఈవిషమపరీక్షయందు దీనజనసంరక్షకుడగు దైవమే మాకు సహాయుడగుగాక" అని చెప్పుచు జగ్గయ్యదృష్టి పైకిసారించి "తండ్రీ! మాకెట్టి ఆపదమూడనున్నదో చూడు. నేను సిద్ధంగానేవున్నాను. ప్రభూ! నీఅనుగ్రహంమాత్రం యీదీనునిపైనుంచు. అదే నాకుచాలు" అని పలికెను.

"విచారపూరితహృదయంతో నేను కోటలోకితిరిగిపోతున్నాను. ఇంతదుఃఖకరమైన జన్మదినమెన్నడునూ నేనెరగను. ఇంధ్యమూలమున ఏమిప్రమాదములు రానున్నవో ఊహించడానికి వీలులేదు. ఇంతవరకూ ఒక్క నాతో తప్ప అమ్మయితరులతో యీసంగతిచెప్పలేదు. ఇంకదీనిని రహస్యంగావుంచడానికి వీలులేదు. అమ్మచేతిని వుంగరంలేకపోతే నాన్నగారు తప్పకుండా గ్రహిస్తారు. నాజన్మదినమునాడు ఆయన యిచ్చిన వుంగరమది. వుంగరం తెస్తావుంటావని అమ్మకనిపెట్టుకుని చూస్తూవుంటుంది." ఒక్కనిముషంవూరుకుని అమ్మాజీ మరల "మీరునిర్దోషులని నేనుపూర్తిగా నమ్మినట్లుచెబతాను. కాని నామాటలు విశ్వసించేవారెవరు?" అని గ్రుడ్లనీళ్లుగ్రుక్కుకొనుచు అన్నది. అమ్మాజీ వెళ్లిపోయినది. విషాదభరమున మైమరచిపోయియున్న జగ్గయ్యయును, కుమార్తెయును ఆమెతోగూడ వీధిగుమ్మమువరకైనను వెళ్లలేకపోయినారు.

చేతులమధ్య తలవానించుకుని జగ్గయ్య కూర్చున్నాడు. ముడుతలువారిన అతని చెక్కులపైకి ధారగట్టి అశ్రువులు ప్రవహించుచుండెను. అతడు తదేకధ్యానమున నేలపంక చూచుచుండెను. అప్పుడు కాంత మాతని పాదములపైబడి "బాబూ! నేను నిర్దోషిని. ఈ విషయంలో నేను నిజంగా నిరపరాధిని" అని దీనయై పలికినది. కుమార్తెను లేవదీసి జగ్గయ్య చాలసేపు తన దృష్టులామెదృష్టులలో కలిపి నిదానముగా పరికించెను. తరవాత నతడు "అవును కాంతం! నీవు కేవలం నిరపరాధివి. నిర్మలములై ప్రదీప్తములైన నీనేత్రములే నీ నిర్దోషిత్వమును చాటుచున్నవి" అన్నాడు. కాంతం ఒకనిట్టూర్పువుచ్చి "దీనికంతటికీ పర్యవసానమేమిటో తెలియడంలేదు. మనగతి యేమవుతుందోకదా! ఇందులో బాధపడేదాన్ని నే నొక్కర్తెనే అయితే నాకేవిచారమూ వుండదు. కాని బాబూ! ప్రాణాధికుడవైననీవు యీవయస్సులో నామూలాన్ని కష్టపడవలసివస్తే నేను సహించలేను." అని విచారించినది. "అమ్మా! జగదీశ్వరునియందు భారంవుంచి నిర్భయంగావుండు. ఆయన ఆజ్ఞలేనిదే మనతలపైనున్న వెంట్రుకకైనా కదపడానికి ఎవరికీ సాధ్యంకాదు. ఏది జరిగినా అది భగవదాజ్ఞానుసారమే జరుగును. సర్వమూ మన మేలుకొరకే జరుగుతుందనినమ్ము. కాబట్టి నిర్విచారంగా నిజమే చెబుతూవుండు. నిన్ననేకవిధాల బెదిరించి భయపెట్టవచ్చు. అనేకవాగ్దానాలుచేసి ఆశపెట్టవచ్చు. ఏమైనాసరేగాని సత్యమును విడిచిపెట్టవద్దు. అంతరాత్మకి వ్యతిరేకంచెయ్యకు. భయంకరనిర్బంధమునవైనను నిర్మలాత్మసుఖిస్తుంది గాని కష్టపడదు. మనల నిద్దరినీ రక్షకభటులు విడదియ్యవచ్చును. నాముద్దుతల్లీ! నిన్నోదార్చడానికి నీజనకుడింక నీపక్కనివుండడు. కాని అందుకు విచారించకు. జగద్రక్షకుడైన ఆతండ్రినే మరింతగాఢంగా నమ్మివుండు. నిర్దోషులను రక్షించడానికి ఆమహాత్మునికంటె శక్తిపరుడులేడుసుమా! అనుక్షణమూ నీకాయన సహాయం చేస్తూనేవుంటాడు. ఆయన సహాయం నీకు లభించకుండా చెయ్యడానికి వేరొకరికి శక్తిలేదు."

వారిట్లు మాట్లాడుకొనుచుండగానే వీధితలుపులు తోసుకొని రక్షకభటులులోపల ప్రవేశించిరి. కెవ్వున కేకవేసి కాంతం తండ్రిబాహువులలో పడిపోయినది. "వాళ్లని విడదియ్యండి. ఆపిల్లకి సంకెళ్లువేసి ఖైదుకి తీసుకుపోండి. ముసలాడికికూడా సంకెళ్లుతగిలించండి." అని పోలీసుఅధికారి కోపముతో కనులెఱ్ఱజేసి ఆజ్ఞాపించెను. తరవాత పోలీసుభటులు యింటిని పూర్తిగా పరిశోధించిరి. పరిశోధనపూర్తి అగునరకు ఎవ్వరిని కోటలోనికి రానియ్యలేదు. కాంతంజనకుని కౌగిలించుకొనియుండెను. పోలీసు లామెను బలవంతముగా

శిక్షదీసి గొలుసులు వేసులకు తగిలించిరి. ఈ భయంకరదృశ్యమును సహించలేక ఆమె మూర్ఛాసనురాలైనది. భటులామె నాసీతిలోనే వీధిలోనికి తీసుకొనిపోయిరి. అక్కడ అప్పుడే ప్రజలుగుంపులు గుంపులుగా మూగి యుండిరి. ఉంగరముసంగతి గ్రామమంతటను ప్రాకిపోయినది. ఊరిలో ఒక్కడును లేకుండ అందరును తోటయందు చేరిపోయిరి. జరిగినదానినిగూర్చి పలువురు పలువిధములగు అభిప్రాయములను వెలిబుచ్చసాగిరి. సన్మార్గప్రవర్తనులును, పరుల కపకారమును తలపెట్టియైనను ఎరుగనివారును అగు జగ్గయ్యను, కుమార్తెయును ఆపదల పాలయినందుకు సంతోషించిన వారుకూడ కొందరక్కడ లేకపోలేదు. స్వకాయకష్టమున జీవించుచున్న ఆదీనుల బ్రతుకులుగూడ కొందరిలో అసూయను కలిగించినవి. “వీరింతసుఖంగా జీవించడానికి కారణమేమిటో యిప్పటికి తేలింది. ఇదివరకీమాయ గ్రహించలేక పోయాంగదా! ఓ ఈపద్ధతిని అందరమూ ధనికులమే కావచ్చును.” అని కొందరన్నారు. కాని ధర్మపరవానులగు ప్రజలలో హెచ్చుమంది జగ్గయ్యకు కలిగిన విపత్తునకు హృదయపూర్వకముగా విచారించినవారే. “ఆహా! సన్మార్గులైనవారికే ఆపదలు తటస్థిస్తావుంటాయి కదా! వీరి కీకష్టం వొస్తుందని కలలోనైనా అనుకున్నామా? సర్వేశ్వరుడు వీరినిర్దోషిత్వమును ప్రకటించుగాక!” అని కొందరు సహృదయులనుకున్నారు. జగ్గయ్యను కుమార్తెను రక్షకభటులు తీసికొనిపోవునపుడు గ్రామములోని పిల్లలు బిక్కమొగములతో “అయ్యో! వీరు ఖైదులోవుంటే మనకి పళ్లూపువ్వులూ యిచ్చేవారెవరు? ఎంతపని!” అని ఏడ్చినారు.

## నాలుగవపుష్పము : కారాగృహము

చెరసాలలో ప్రవేశపెట్టినపుడు కాంతమ్మకు శరీరస్మృతిలేదు. కొంచెము తెలివిరాగానే ఆమెకు దుఃఖము తలముంపులుగావచ్చినది. కొంతసేపుదుఃఖోపశమనమగునట్లు ప్రార్థించినది. భయమువలనను, విచారము వల్లను, అలిసిపోవుటవల్లను ఆమెశరీరము విశ్రాంతినికోరుచుండెను. అక్కడనున్న గడ్డిపరుపుపై మేనువాల్చిన వెంటనే ఆమెకు గాఢనిద్రపట్టినది. కాంతమ్మకు మెలకువవచ్చుసరికప్పుడే రాత్రిపడినది. గదిలో అన్ని మూలలను చీకట్లుఅముకొని దృష్టివరోధమును కలిగించుచుండెను. ఉంగరముకథను పూర్తిగా జ్ఞాపకము చేసుకొనుట కామెకు చాలసేపు పట్టినది. అంతయును ఒకస్వప్నమువలె నామెకు తోచుచుండెను. తోటలోని బంగాళాలో తనగదిలోనున్నట్లే ఆమె భావించుకొన్నది. ఈస్థితిలో ఆమెచేతులనున్న యినపసంకెలలు ధ్వనిచేసినవి. భయభ్రాంతురాలై ఒక్కచెంగున పరుపుమీదనుండి లేవబోయినది. అప్పటికామెకు నిజస్థితి పూర్తిగా జ్ఞాపకమువచ్చినది. మరల దుఃఖమామెను ముంచివేసినది. అంజలిఘటించి ఆమెయిట్లు ప్రార్థించినది. “దయానిధీ! తండ్రీ! నిగళబద్ధములైయున్న ఈ హస్తములను జోడించి నమస్కరించుటగాక నేనేమి చెయ్యగలను? ఈ భయంకరకారాగృహమునందుండి నీకు నమస్కరిస్తూవున్న యీదీనురాలివంక ఒక్కసారి చూడుము. ప్రభూత్తమా! నేను నిర్దోషినని నీవెరుగుదువుకదా! ఈ విపన్నురాలిని రక్షించుము. వృద్ధుడై మహావిచారభరమున క్రుంగియున్న మాబాబును దయజూడుము. నాకింతకు రెట్టింపు దుఃఖమునకైనను సమకూర్చి ఆముదుసలిని రక్షించు.” జనకుడు తలపునకువచ్చుటచేత ఆమెకండ్లనుండి నీరు ధారాపాతముగా వర్షించినది. దుఃఖోద్రేకమున నోటమాట కట్టుబడిపోయినది. ఆమె అట్లే కొంతకాలమేడ్చినది.

అంతవరకును మేఘములచాటున అణగియున్న చంద్రుడు నిర్మలకాంతులతో ప్రకాశించుచుండెను. గవాక్షమునుండి చంద్రకాంతి ఆమెబంధింపబడియున్న కొట్టులోనికి పడుచుండెను. ఆవెలుగున గదిలోని వస్తువులన్నియు స్పష్టముగా కనబడుచుండెను. రాతిగోడలు, నీటితోనున్న మంటికుండ, గడ్డిపరుపు అన్నియును ఆమెకుగోచరించినవి. ఈ వస్తువులామెకు దుఃఖప్రదములేయైనను చీకట్లుపోయినతో ఆమెకు కొంతధైర్యము కలిగినది. కాని ఇంతలో ఒకకారుమేఘము తిరిగి చంద్రుని మాటుపరచినది. గది గాఢాంధ

కారబంధురమైపోయినది. కాని యీసారిచంద్రుడెంతోసేపు మేఘములచాటున నుండలేదు. అయిదునిమిష ములలో మబ్బుతెరవిడిపోయి స్వచ్ఛమగు చంద్రకాంతి యథాప్రకారము ప్రపంచమున నిండిపోయినది.

ఆపూర్వమునుచూచి కాంతం "ఇలాగే నిరపరాధులుగూడ కొంతకాలము అపవాదులపాలయినప్పటికీ చివరకు వారు నిజనిర్మలకాంతితో ప్రకాశించక తప్పదు. ప్రస్తుతం నాజీవితం అంధకారావృతమైవుంది. అతినీచములగు అపవాదములు నాపై ప్రబలివున్నవి. తండ్రీ! వీనినన్నిటిని గడిచి నాఅమాయకత్వము ప్రకాశించేటట్లనుగ్రహించు." అని అనుకున్నది.

## అయిదవ పుష్పము : విచారణ

రెండురోజులు గతించినవి. మూడవనాటి ఉదయముననే ఆమె విచారణకొరకు కొనిపోబడినది. న్యాయస్థానమునుచూచి కాంతంవణకిపోయినది. న్యాయాధిపతి సమున్నతవేదికపైని ఆసీనుడై యుండెను. అతనిముందొక బ్రహ్మాండమగు మేజాబల్ల కాగితముల భారమున మూలుగుచుండెను. ఆబల్లప్రక్కనే కాగితముకట్టలను సరిచూచుకొనుచు గుమస్తానిలుచుండెను. న్యాయస్థానము ప్రేక్షకులచే క్రిక్కిరిసి యుండెను. న్యాయాధిపతి అనేకప్రశ్నలువేసెను. కాంతం వానికన్నిటికిని నిజము తప్పకుండ జవాబులు చెప్పినది. ఆమె ఏడ్చినది. కాని నిశ్చలురాలై తన నిర్దోషిత్వమునుమాత్రము నొక్కిచెప్పుచుండెను. "ఏయ్! అమ్మాయీ! నన్ను దగాచెయ్యడానికి ప్రయత్నించకు. నువ్వుగాక ఆగదిలో కెవ్వరూ వెళ్లలేదు. అల్లాంటప్పుడు వుంగరం తప్పకుండా నువ్వేతీసివుండాలి. తక్షణంనీ నేరం వొప్పుకో" అని న్యాయాధిపతి గర్జించెను.

"నేనబద్ధంచెప్పలేదు-ఉంగరంసంగతి నాకుతెలియదు, నేను దానినిచూడనైనను చూడలేదు."

"ఆ! ఏమిటీ? నీచేతులో వుంగరంవుండగా చూచినవాళ్లుండగానే నువ్వు అబద్ధంచెప్పడం లాభం లేదు. ఇప్పుడైనా ఒప్పుకుంటావా లేదా?" న్యాయాధిపతి భయంకరగర్జనకు కాంతం గడగడలాడిపోయినది. అట్లుజరగడం అసంభవమనిమాత్రమామెచెప్పివేసినది. విచారణాధికారి ఒకగంట కొట్టగానే దాసీ వున్న లోపలప్రవేశించినది. ఈర్ష్యాగ్రస్తురాలగు వున్న యజమానురాలికి కాంతంపైని అసూయ కలిగించవలెనను అభిప్రాయముతో ఒక పన్నాగముపన్నినది. "ఆదుర్మార్గురాలుగాక యీవుంగరాన్ని యింకెవ్వరూ యెరగరు. మేడదిగి వొస్తున్నప్పుడు ఆమెచేతిలో ఒక వజ్రపుటుంగరం వుండగా చూశాను. నన్ను చూసేసరికి ఆమెవులికిపడి వుంగరాన్ని దాచేసింది. నాకప్పుడే అనుమానకలిగింది. కాని వృథాతొందరయెందుకని వూరకున్నాను. ఆమెకి అమ్మగారు చాలాబహుమానాలు యిచ్చివుండడంచేత యిదిగూడా అలాగిచ్చినదే కాబోలనుకున్నాను. దొంగతనమే అయితే యెలాగూ దాగదుకదా అని నాఅభిప్రాయం. ఆరోజున అమ్మగారిగదిలోనికి నేను వెళ్లడం తటస్థించలేదు. అందుకు నేను సంతోషిస్తున్నాను. ఈ దుర్మార్గురాలివంటివారు ఏపాపమూ యెరగనివాళ్లమీద యీ అపవాదాన్ని తోసెయ్యగలరు." అని వున్న కోటలోనివారందరితోను చెప్పినది. పైప్రకారము చెప్పినందుకుగాను వున్ననుసాక్షిగా పిలిపించవలసివచ్చెను. అసందర్భములురాకుండ న్యాయస్థానమునందైనను తను వెనుకటచెప్పినట్లుగనే మరల మరల నిర్ధారణగా చెప్పవలెనని వున్న నిశ్చయించుకున్నది. కాని భగవంతునిముందర సత్యముచెప్పమని అధికారిప్రమాణముచేయించి నప్పుడామెహృదయము కొట్టుకున్నది. కాళ్లు కంపించినవి. అయినను అధికారిమాటలనుగాని అంతరాత్మబోధనలనుగాని ఆమె చెవిదూరనియ్యలేదు. "నేను మొదట ఒకలాగుచెప్పి యిప్పుడింకొకలాగుచెబితే నాకు శిక్షతప్పదు" అనుకుని వున్న కాంతంవైపుతిరిగి కఠినవాక్కులతో "నీచేతులో వుంగరంవుండగా నేను చూశాను. వుంగరం నీవేతీశావు" అని చెప్పివేసినది.

కాదని నాకప్పుడే తెలిసినను. నిర్దోషురాలైనను ఆమెకు శిక్షతప్పనపుడు ఇప్పుడిల్లాగ ఒక్కసారి ఆమెను చూడనివ్వడం నాకుమహోపకారమే."

ఒకరక్షకభటుడు ఆవృద్ధుని కాంతం గదిలోనికితీసుకొనివెళ్లెను. ఖైదీకొరకు తేబడిన ఆహారపదార్థములట్లే ఉపయోగింపబడక ఒకమూలబడియుండెను. కాంతమాభోజనమును ముట్టుకోలేదు. జగ్గయ్యనచ్చట విడిచిపెట్టి భటుడుపైని తాళముబిగించుకుని వెళ్లిపోయినాడు. వారు గదిలోప్రవేశించుసరికి కాంతం గోడవైపు తిరిగిపరుండెను. గదిలో మనుష్యుల అలికిడివిని ఆమె వెనుదిరిగిచూచినది. ప్రియజనకుని చూచుసరికాయమాయకురాలి సంతోషమేమని వర్ణించవచ్చును! ఒక్కకేక వేసి ఆమెలేవబోయినది. కాని సంకెలలమూలమున సాధ్యపడలేదు. గడ్డిపరుపుపైనే వృద్ధుడుకూడ కూర్చొనెను. తండ్రిమెడకు కాంతం తనబాహువులను పెనవేసినది. అశ్రుధారలు అవిరళములై కొంతసేపటివరకును వారిని మాటాడనియ్యలేదు. చివరకు జగ్గయ్య తనకు న్యాయాధిపతి చెప్పినట్లుగానే కుమార్తెను ప్రశ్నించినాడు. తండ్రి అట్లడుగుట కాశ్చర్యచకితయై అతనిమాటలు పూర్తికాకముందే కాంతం "బాబూ! నువ్వయినా నన్ను నమ్మకపోతివికదా! ఆహా! నన్ను నిర్దోషినిగా నమ్మువారు ఒక్కరైనా లేరుకాబోలు! బాబూ! నేనుమాతృద్రోహికాదు. నమ్ము. [illegible] పితృద్రోహికాదు"అని దీనయైపల్కినది. "అమ్మా! తొందరపడకు. నేను నిన్ను నమ్మకపోలేదు. తల్లీ! నిన్ను నమ్మనా? కాని నిన్నిలాగ అడగాలని న్యాయాధిపతియాజ్ఞాపించేడు. కాబట్టి అల్లాఅడిగేను." అన్నాడు జగ్గయ్య.

ఇద్దరును కొంతసేపు మాటాడకుండ ఊరుకొనియుండిరి. జగ్గయ్య కుమార్తెముఖమువంక చూచెను. దుఃఖాతిరేకమున ఆమె చెక్కులుపాలిపోయి లోతుకుపోయియుండెను. కండ్లుగుంటలుపడిపోయినవి. అధికముగా నేడ్చుటవల్ల ఎర్రబారిపోయినవి. సుదీర్ఘములగు కేశపాశములు సంస్కారహీనములై చెదరి భుజములపైపడుచుండెను. ఆమె దీనావస్థనుగాంచి బెగిలిపోయి జగ్గయ్య "ముద్దుబిడ్డా! భగవంతుడు నిన్నుకఠినపరీక్షకు గురిచేశాడమ్మా! కాని ఇంకాకఠినతరపరీక్షయుందున్నదనే నాభయం." అని వలవలయేడ్చెను.

"బాబూ! నాకోసం నేనువిచారించను. వృద్ధుడవైన నీకొరకే నామనస్సు దుఃఖిస్తూంది."

"తల్లీ! నాకొరకుభయపడకు. నాకేఆపదయును రానేరదు. నీస్థితిమాత్రం నిజం గాభయంకరంగా వుంది. నీనిర్దోషిత్వమును ప్రకటించడమే దుర్ఘటమైనపనిగాతోస్తుంది. కాని ఆశమాత్రం నన్నువదలడంలేదు."

"ఆహా! నీకాపదరాదనుమాటే నాకుహాయిగావుంది. నిజంగా నాకుమరణశిక్షవిధిస్తే ఎంతబాగుండును? చావుకినేను భయపడను. జగదీశ్వరుని సన్నిధికిపోయి అక్కడ మాఅమ్మను కలుసుకుంటాను."

ఈమాటలు వృద్ధునిహృదయమును కలచివేసినవి. చంటిబిడ్డవలె అతడుఏడ్చెను. దుఃఖోద్రేకమున అతడు సర్వప్రపంచమును మరిచిపోయెను. హస్తములు జోడించి అతడిట్లనెను. "అమ్మా! ఈనేరానికే నీకు మరణశిక్షవిధించరు. కాని నీచిన్నశిక్షయైనా మానవంతురాలవగు నీవుభరించలేక మరణముపాలవడంనిశ్చయం. నీకీవైరాగ్యభావములను ప్రసాదించిన సర్వేశ్వరునకు నమస్కరిస్తూన్నాను. వృద్ధాప్యమునకుంగిపోయిన యీదీనునికి- ఇహలోకమున సౌఖ్యనిధానమై- లేక లేక మిగిలిన ముద్దుబిడ్డయై- కడకాలమున దిక్కయినకుమార్తెను యీరీతిగా నష్టపోవడం యెంతదుస్సహమో ఆలోచించు. కాని—"అతనికంఠము రుద్ధమైపోయెను. "కాని, ప్రభూత్తమా! నీయాజ్ఞకువ్యతిరేకంలేదు. దుఃఖాతురుడును వృద్ధుడునునగు ఈనాహృదయమునుండి ఒకమహాత్యాగమును కోరినావు. అయినను నాహృదయపూర్వకంగానే దానిని నీపవిత్రపాదారవిందములసన్నిధిని సమర్పించుకుంటున్నాను. ఈనాముద్దుకుమార్తెను నీహస్తకమలము లందుంచుతున్నాను. జగత్పితవగు నీయపారవాత్సల్యమునవే నీబిడ్డను అప్పచెప్పుతున్నాను. తండ్రీ! నీసంరక్షణయందే ఆమె అధికసౌఖ్యమునందగలదు."

ఎడతెగక వచ్చుచున్న అశ్రుధార లాతని వాగ్ధోరణి నరికట్టినవి. కొంతసేపటికి మరల కండ్లు తుడుచుకొని అతడు చెప్పుట ప్రారంభించెను. "అమ్మా! ఇంకొక్క సంగతి. నీ శిక్షను దృఢపరిచినది పున్న సాక్ష్యము. ప్రమాణపూర్వకంగా నీ చేతులలో వుంగరాన్ని చూసినట్లు ఆమె చెప్పింది. కాని నువ్వామెను మనస్ఫూర్తిగా క్షమించాలి సుమా! ఆమె దుర్మార్గురాలే కావచ్చును. అయినా ఆమెయెడల నీకు క్రోధం వుండకూడదు. కోటలలో, జమీందారుల భవనమందు, చీనిచీనాంబర శోభితురాలై, అనంత భోగముల ననుభవిస్తూవున్న పున్న కంటె అంధకారభరితమైన యీ చెరసాలలో నిగళబద్ధవై కఠినమైన రాతినేలనున్న నీవే యెక్కువ సౌఖ్యమును అనుభవిస్తున్నావు. గౌరవహీనమైన బ్రతుకుకంటె నిష్కళంకమైన చావే మేలు. అమ్మా! ఆమెను క్షమించు. ఈ బాధ అంతా భగవంతుడు నీ మేలుకోసం కలిగించినదే అని త్రికరణశుద్ధిగా నమ్మి పున్నను క్షమించు. ఏం?"

కాంతమ్మ అంగీకారసూచకముగ తలవాడించినది. ఇంతలో పోలీసు ఉద్యోగి గదిని సమీపించుచున్నట్లు అడుగుల శబ్దము వినవచ్చినది. ఇంక తాము విడిపోవు సమయము సన్నమైనదని తెలుసుకుని జగ్గయ్య కుమార్తెను కౌగిలించుకుని "తల్లీ! నాముద్దుబిడ్డా! నిన్ను విడిచిపోలేకుండా వున్నానమ్మా! జగత్కర్త నిన్ను రక్షించుగాక! అబ్బా! ఈయెడబాటు నన్నెంత బాధిస్తూంది! నాయనా! కాంతం! మన కిదే ఆఖరు సంభాషణ అయినయెడల, యీలోకంలో మనకు యిదే కడసారి చూపులయ్యే యెడల నేనుగూడా త్వరలో నీవెనకనే స్వర్గానికి రావడానికి సిద్ధంగా వున్నానని నమ్ము. నిన్నెడబాసిన తరువాత నేను చిరకాలం జీవించివుండలేను." అన్నాడు. పోలీసు భటుడు తొందర చేయుచుండెను. కాంతం తండ్రిని విడిచిపెట్టలేకపోయినది. తనశక్తినంతను వినియోగించి ఆమె తండ్రిని కౌగిలించుకున్నది. రక్షకభటుని తొందరవల్ల మెల్లగ కుమార్తె కౌగిలిని విడిపించుకున్నాడు జగ్గయ్య. మొదలు నరికిన వృక్షము వలె కాంతం నేలమీద కూలిపోయినది.

—మిగిలియున్నది.

## గృహలక్ష్మి

శ్రీమతి చోడవరపు రంగనాయకమ్మ గారు

కలువకంటులపాలిటి కల్పతరువు
చిగురుబోణులపాలిటి దివిజమణియు
కమలనేత్రులపాలిటి కామగవియు
అంబుజాక్షులపాలిటి అమృతభాండ
మనగనొప్పు గృహలక్ష్మి నీవంకురించి
కోరివిద్యారసంబును గ్రోలిమించి
మెల్లమెల్లగ లతకూనయుల్లసిల్లి
అల్లిబిల్లిగ జగమెల్లయల్లుకొనియు
కొల్లలుగిమొగ్గలును మృదుపల్లవములు
వెల్లివిరియగ పుష్పముల్ కొల్లపూసి
కాయలనుకాసి ఫలమియ్యగాగనుంటి
వమ్మ! మాతల్లి! సుగుణమణీమతల్లి!
చల్లగా నాంధ్రసోదరీసతులనెల్ల
కోరివిద్యావతుల జేయ కూర్మితోడ
నెన్నొయత్నంబులను జేసియలసినావు
వెన్ను కృపవల్ల నిప్పుడే వెలదులంత
మెల్లగా సరస్వతి కృపావల్లరులయి
సుగుణముల నేర్చి దుర్గుణరహితలగుచు
పతులసేవించుచును పతిప్రాణలగుచు
పరులకష్టముల్ గని దయాపరతలగుచు
పరులవిభవంబుగని అనసూయలగుచు
వన్నెగాంచుచునున్నారు వారిగనియు
సకలసంతోషసంయుక్తజలధియందు
నీదులాడుచు మురియుచు నీవుయుంటి
వమ్మ! గృహలక్ష్మి! జయమమ్మ! విజయలక్ష్మి!
తల్లి! గృహలక్ష్మి! నీకువందనములమ్మ!
పరగ స్త్రీవిద్యయందభిమానులైన
పావనులు ఆంధ్రసోదరప్రముఖులకును
పద్మపత్రాక్షునకు పార్వతీశునకును
భారతీదేవికిని ప్రణామంబు సేతు.

# పూలసజ్జ

కాళూరి వేంకటరామారావుగారు

## ఏడవ పుష్పము: తీర్పు, పర్యవసానము

ఒకనాడు పనిమీదపోవుచు చెరసాలయందు బంధింపబడియున్న కాంతమ్మను పున్న చూచెను. చిక్కి శల్యావశిష్టమైయున్న యామె దీనవదనమును గాంచుసరికి పున్న శరీరము "ఝల్లు" మని జలదరించిపోయినది. భయంకరఖడ్గప్రహారమైనట్లామె హృదయమున దుర్భరవేదన బయలుదేరినది. తాను చేసిన మహాపరాధము మూలమున ఏపాపమును ఎరుగని కాంతం బాధలపాలగుట కండ్లారచూచినప్పటి కామెమనస్సున పశ్చాత్తాపముదయించినది. తనఅసత్యములకు భగవంతునిముందర జవాబుచెప్పకతప్పదుకదాయని ఆమె భయపడిపోయినది. ఆనాడు భోజన మామెకు నోటికి రుచించలేదు.

చూచినవారందరును ఆమెకేదియోదయ్యముపట్టినదని భావించిరి. తనలో తనే ఏదోఅస్పష్టవచనములను నిత్యమును పున్న గొణుగుకొనుచుండెడిది. సమీపమునకు వచ్చువారిని చూచి బెదరుచూపుల నిగుడ్చుచుండెడిది. రాత్రింబగళ్లామెకు విశ్రాంతిలేకపోయినది. ఆమెచేసిన నేరములు భయంకరరూపములు ధరించి ఆమెనునిలువనీయకుండెను. కాని అప్పటికైనను తననేరమును ఒప్పుకుని పశ్చాత్తాపమును వెలిబుచ్చి కాంతమును రక్షించుట కాకతెనురాలిచి తాను సిద్ధపడలేదు.

చివరకు న్యాయాధిపతి తీర్పును చెప్పివేసెను. ఉంగరమును దొంగిలించియునుగూడ నేరమును ఒప్పుకొననందుకు కాంతమ్మకును, ఆమె నేరమునకు దోహదమొసంగినందుకు జగ్గయ్యకును యావజ్జీవప్రవాసశిక్ష విధింపబడెను. వారిఆస్తిని వేలముచేయగా వచ్చినధనమునందు కోర్టుఖర్చులుపోయి మిగిలినదానిని జమీందారువారికిచ్చివేయునట్లాజ్ఞాపింపబడెను. మరునాడు తెల్లవారక పూర్వమే వారినిద్దరిని రాజధాని సరిహద్దులను దాటించి విడిచిపెట్టి వచ్చుటకు ఏర్పాట్లు జరిగినవి.

అంతకుపూర్వము రెండురోజులక్రిందటే కాంతంఅమ్మాజీకి బహుమానముగా నొసగిన పూలసజ్జ మేజాబల్లపైనుండగా జమీందారిణిచూచినది. పున్ననుచూచి విచారముతో నామె "ఆసజ్జని అక్కడనుంచితీసెయ్యి. దాన్ని చూసేటప్పుడల్లా నాకుదుఃఖం ఆపుకోలేకుండావస్తూంది. విచారకరములగుసంగతులన్నీ జ్ఞాపకమురావడంచేత నామనస్సుకి శాంతిలేకుండావుంది" అనియాజ్ఞాపించినది.

పున్న ఆసజ్జను తీసుకుని ప్రవాసమునకు బోవుచున్న కాంతమ్మనుచూచి హేళనగా "అమ్మా! కాంతంగారు! తమబహుమానం తమరేస్వీకరించండి. నీబహుమానంపుచ్చుకోడానికి అమ్మగారికిష్టంలేదు. ఈదరిద్రపు సజ్జనుయిచ్చి మంచిచీరను లాగేవుకాని నీరోజులుతిరిగిపోయినవి. ఇదుగో నీసజ్జను నీతోటే తీసుకుపో" అని ఆమెముందు సజ్జను విసరికొట్టి తలుపు గభాలునవేసుకుని లోపలికిపోయినది. జన్మస్థలమును వదలిపోవునప్పటి వారిమనస్సు లెటులుండెనో?

కన్నీరుగార్చుచు కాంతం సజ్జనుతీసుకొన్నది. జన్మదేశమును వదలుకొని పోవుచున్న యాదీనులవద్ద ఒకకర్రయైనను సహాయార్థము లేకుండెను. తాముచిరకాలము సుఖజీవనమును గడిపిన యింటివైపు మరల మరల చూచుచు కాంతం దుఃఖభరమున తలవాల్చుకొని నడుచుచుండెను. ఆయింటిని వదిలిపెట్టుట యామెకు బహుకష్టముగానుండెను. ఆయిల్లును, కోటగోపురములును, ఊరిలోని సోమేశ్వరాలయశిఖరాగ్రములును దృష్టిగోచరమగుచున్నంతసేపును ఆమెయల్లే వెయ్యిసారులైనను వెనుకకు తిరిగిచూచినదని చెప్పవచ్చును. చివరకొకచిన్న పర్వతము మాటున ధర్మవరదుర్గమంతయును మరుగుపడిపోయినది.

రమారమి జాముప్రొద్దెక్కుసరికి వారు ధర్మవరజమీందారీ సరిహద్దులను దాటిపోయిరి. అక్కడ వరకును దిగబెట్టి వారితోవచ్చిన ప్రభుత్వోద్యోగి వెనుకకుపోయెను. అదియొకసాంద్రారణ్యప్రాంతము. జగ్గయ్యవిషాదభరితుడై ఒకచాపరాతిమీద కూలబడిపోయెను.

## ఎనిమిదవ పుష్పము: ఆపద్బాంధవుడు

ధర్మవరజమీందారుల యరణ్యములపైని ఆదినారాయణయే సర్వాధికారి. జగ్గయ్యయును, కుమార్తెయును ఇంకను కూర్చొనియుండగనే ఆదినారాయణ వారిని సమీపించెను. అతడును జగ్గయ్యయును విదేశయాత్రా సందర్భమున జమీందారు పరివారమునందుండిరి. అప్పటినుండియును వారిద్దరికిని అత్యంతమగుస్నేహముకలదు. మిత్రునిచూచినతోడనే ఆదినారాయణ "ఓహో! జగ్గయ్యా, నువ్వేనా? మీకుప్రవాసశిక్షపడిందని విన్నాను. ఈవయసులో, ఈస్థితిలో ఇల్లువదలిపెట్టి పోవడం బహుకష్టసాధ్యమైనపని."

"సరే. కాని జగ్గయ్యా! చేతులోకర్రకూడాలేకుండా బయలుదేరేవు. ఇదిగోయీకర్రనువ్వుతీసుకో. కర్రమంచిబలమైనది. ఉపయోగంగా వుంటుంది" అనిచెప్పి ఆదినారాయణ తనచేతికర్రను జగ్గయ్యకిచ్చి జేబులోనుంచి కొంతసొమ్ముతీసి "ఇదిగో రాత్రి కొంతకలప వేలంవెయ్యగా వచ్చినసొమ్ము. దీన్నిమీరు దారి ఖర్చులకి వుపయోగించండి. ఇంతకంటె నేనేంచెయ్యగలను?" అని కంట నీరుపెట్టుకున్నాడు.

"ఆసొమ్ము జమీందారువారిదికదా!" అన్నాడు జగ్గయ్య.

"ప్రియమిత్రమా! ఆవిషయమై అంతఆలోచించనక్కరలేదు. జమీందారుల సొమ్మిదివరకే చెల్లిపోయినది. ఈవేలం చాలారోజులనాటిది. ఒకస్నేహితుడు డబ్బుచెల్లించలేకపోతే నేనప్పుడు బదులిచ్చి ప్రభువులసొమ్ము చెల్లేటట్లుచేశాను. నిన్నరాత్రి అతడుమళ్లా నాసొమ్ము నాకిచ్చేశాడు. ఇది భగవంతుడు నిజంగా నీకోసమనే యేర్పాటు చేశాడని నానమ్మకం. లేకపోతే యేనాడో బదులిచ్చినసొమ్ము నిన్నరాత్రిరావడమేమిటి?"

"సరే. అలాగైతే సొమ్ముపుచ్చుకోడానికి నాకభ్యంతరంలేదు. ఆదినారాయణా! భగవంతుడు నీకు యింకోకలాగయిస్తాడులే. కాంతం! చూసేవా! ఇంకామనప్రయాణం ప్రారంభించకముందే భగవంతుడు మనకెల్లాసహాయం చేస్తున్నాడో! అతడెంతదయామయుడో గ్రహించుకో."

ఆదినారాయణ కండ్లనీళ్లుగ్రుక్కుకొనుచు సెలవుపుచ్చుకొనెను. "జగ్గయ్యా! సెలవు. అమ్మా! కాంతం! వెళతాను. భగవంతుడు మిమ్ము రక్షించుగాక" అని ధైర్యముచెప్పి వెళ్లిపోయినాడు. కుమార్తె చేయిపట్టుకొని అడవినిబడి జగ్గయ్య విశాలప్రపంచకములోనికి బయలుదేరినాడు.

## తొమ్మిదవ పుష్పము: ఆశాలేశము

ఒకనాడు మరొకపర్వతమయప్రదేశమున ప్రయాణము చేయవలసివచ్చెను. మార్గము దుర్గమమైయుండెను. ఎంతదూరము నడచినను ఒక్కగ్రామమైనను వారికి కనబడలేదు. జగ్గయ్యకి హఠాత్తుగా జ్వరము తగిలినది. ఒక్కఅడుగైనను ముందుకుపెట్టలేక అతినీరసముతో ఆతడొకపర్వతపాలుప్రదేశమున కూలబడిపోయెను. అతని నోరెండిపోయి మాటలాడుశక్తి నశించినది. తండ్రిదురవస్థచూచి కాంతం భయభ్రాంతురాలైపోయినది. తండ్రిగతియేమగునోయని యామె హృదయము వేదననందుచుండెను. మంచినీటికొరకెంత ప్రయత్నించినను చుట్టుప్రక్కల ఒక్కనీటిబిందువుకూడ దొరకలేదు. పరిసరములందెవరైన నుందురేమోయని సహాయముకొరకు కాంతంగొంతెత్తి కేకవేసినది. కొండకోనలలోనుండి ప్రతిధ్వనులుతప్ప వేరుజవాబే లేకపోయినది. కనుచూపుమేర యెక్కడను యిండ్లుకనబడలేదు. నిరంతరప్రయాణములవలన బడలియుండి

నప్పటికిని, పాదములు కందిపోయి బాధపెట్టుచున్నప్పటికిని కాంతం మెల్లిగా కష్టపడి అచ్చటికొండపైకెక్కి చుట్టుప్రక్కల జనసంచారమున్నదేమోనని పరికించినది. కొండకు రెండవప్రక్క దిగువభాగమున నొక చక్కనియిల్లొకటి కనబడినది. ఇంటిచుట్టును పచ్చనివరిచేలతో నిండి పొలములు లక్ష్మీకళ లొలుకుచుండెను. పచ్చనిగడ్డిబీడులు నేత్రపర్వ మొనర్చుచుండెను. మహారణ్యమధ్యమున ఋషికుటీరమువలె ఆగృహము ప్రశాంతమనోహరమైయుండెను.

కాంతమ్మకు ధైర్యముకలిగినది. ఒక్కపరుగున నాయింటిని సమీపించినది. దుఃఖముమూలమున డగ్గుత్తికపడినకంఠముతో గ్రుడ్లనీళ్లగ్రుక్కుకొనుచు ఆమె సహాయముకొరకు ప్రార్థించినది. ఆయింటి యజమానులగు రామన్నయును భార్యయును కాస్తంత వయసుముదిరినవారు. నిస్సహాయురాలగు కాంతమ్మను చూచి ఆదంపతుల హృదయములు కరిగిపోయినవి. పాలిపోయినముఖమును, శల్యావశిష్టమైన శరీరమును గాంచి వారు కడుంగడు దుఃఖించిరి.

“ఎడ్లనికట్టుకుని బండితోలుకెళ్లి ముందాముసలాతణ్ణి యిక్కడికి తీసుకురా, లే, ఆలస్యం చెయ్యకు” అని రామన్నతో అతనిభార్య ముత్యాలు చెప్పినది. బండి తయారుచెయ్యమని రామన్న పాలికాపుతో చెప్పినాడు. కంచుచెంబులో కొన్ని వెచ్చనిపాలును వేరొకచెంబులోయిన్ని మంచినీళ్లును ముత్యాలు సిద్ధముచేసినది. జగ్గయ్యరాగానే పడుకొనుటకని ఒకపరుపును మంచమును వేసి సిద్ధముగానుంచినది. బండి కొండచుట్టును తిరిగిపోవలసియుండెను. ఎంతత్వరగా ఎడ్లనుపరుగెత్తించినను ప్రయాణము అరగంటకు తక్కువ బట్టదని రామన్న చెప్పెను. అదివిని కాంతం పాలును, మంచినీళ్లనుపట్టుకుని తనువచ్చినఅడ్డుదారినే మరల నిముషములో తండ్రిని చేరుకున్నది. ఈలోపునజగ్గయ్యకి కొంతప్రాణము చేరుకున్నది. అతడు మెల్లిగా ఒకచెట్టు మొదటికిచేరి మానుకిచేరబడి కూర్చున్నాడు. కుమార్తె ఏమైపోయినదో యని యాత్రతనందుచున్న నాతని హృదయము కాంతమ్మను చూచుటతోడనే యించుక నెమ్మదించినది.

రామన్నయును, అతనిభార్యయును జగ్గయ్యను బండిలో కూర్చుండబెట్టుకుని యింటికి తీసుకొని పోయిరి. ఒకకుటుంబము స్వేచ్ఛగానివసించుట కనుకూలముగానున్న యింటిలోని ఒకభాగమును జగ్గయ్య కొరకు ప్రత్యేకముగ ఖాళీచేసియిచ్చివేసిరి. తండ్రిమంచముప్రక్కనే తనమంచమునుగూడ కాంతం వేసుకున్నది. ఎడతెగని ప్రయాణములవలన జగ్గయ్యకొజ్వరమువచ్చినది. అతనిశరీరము విశ్రాంతిని కోరుచుండెను. ఇంట్లో కలిగినంతమట్టుకు లేదనకుండ జగ్గయ్యకుకావలసిన వస్తువులనన్నిటిని ముత్యాలుయిచ్చినది. పాలు, పెరుగు, నెయ్యి, కాయకూరలు మొదలగువానిని ప్రతిరోజును జగ్గయ్యకు రామన్న పంపుచుండెను. ఉదారస్వభావులును, సదయహృదయులునగు నాదంపతులలో స్నేహము సమకూర్చినందుకు సర్వేశ్వరునికి జగ్గయ్యయు, కుమార్తెయునుకలిసి కృతజ్ఞతాపూర్వకనమస్కృతులాచరించిరి. తీరికసమయములందు కాంతం కుట్టుపని చేయుచుండెను. కుట్టుపనియందామెకు మంచి ప్రవీణతకలదు. తమ్మాదరించిన రామన్నకుటుంబమునకు కావలసిన బట్టలనన్నిటిని ఆమెయే కుట్టియిచ్చుచుండెను. అవసరప్రస్తావనలతో నిరర్థకముగా ఒక్కనిముషమైనను పోనిచ్చెడిదికాదు. ఆమె తెలివితేటలనుచూచి ముత్యాలు అమితానందమునందినది. కుమార్తె సంరక్షణవల్లను, వృద్ధదంపతుల ఆదరణాతిశయములవల్లను జగ్గయ్య సంపూర్ణారోగ్యవంతుడైనాడు. అతనికి మామూలుబలముచేకూరినది. ఊరికనేకూర్చొనుట జగ్గయ్యతత్వమునందే లేదు. అతడు మరల సజ్జలల్లుటప్రారంభించెను. వ్యవసాయదారుల కుపయోగించు తట్టలుకూడ అల్లుచుండెడివాడు. మొదట ఒకఅందమగు తట్టను అల్లి కృతజ్ఞతాసూచకముగా జగ్గయ్య ముత్యాలుకియిచ్చెను. దానిఅందమునుచూచి యామెయెంతో ముచ్చట పడినది. రామయ్యకూడ జగ్గయ్యపనితనమును మెచ్చుకొనెను.

## పదియవ పుష్పము: లక్ష్మీవిలాసము

లక్ష్మీవిలాసమునకు సమీపముననే రామన్నకు వేరొకతోటకలదు. పొలముపనియందు మునిగిపోయిన రామన్న కాతోటయందు తగుశ్రద్ధచూపుట కవకాశము లేకపోయెను. అందుచే దానినిండ తుప్పలును పొదలును సాంద్రముగ పెరిగియుండెను. ఆతోటను బాగుచేయుటకు జగ్గయ్య పూనుకొనెను.

కాంతంసహాయముతో జగ్గయ్య తోటపని ప్రారంభించెను. దినమంతయును తోటలోనే పనిచేయుచుండెడివాడతడు. తోటనుదున్ని మళ్లక్రిందభాగించి రకరకముల పాదులునాటెవాడు. కొన్నిమళ్లలో పూలచెట్లు పెంచెను. మడికిని మడికిని మధ్యను కంకరదారు లేర్పరచెను. పూలతోటపని అంతయును కాంతమ్మదే. కొద్దిరోజులకే తోటఅంతయు రంగురంగుల పూలతో నిండిపోయినది. పరిసరప్రదేశమంతయు మధురపరిమళములలో తేలిపోయినది.

ఫలవృక్షములుగూడ మామూలుకంటె అధికఫలములనిచ్చినవి. జగ్గయ్య చెయ్యివైచిన గొడ్డుకేలుగూడ ఫలప్రదమగుచుండెను. అతడు తనపూర్వకష్టములనన్నిటిని పూర్తిగమరచిపోయెను. అయిదుసంవత్సరములిట్లు గడచినవి. నూతనసౌఖ్యమయజీవనమునందు వారు తమకష్టములను మరచిపోయిరి. క్రమక్రమముగా జగ్గయ్య వృద్ధాప్యమునకు లొంగిపోవుచుండెను. అతనిశక్తి రోజురోజును మందగించిపోవుచుండెను. పనియందు ఆయాసము గోచరించుచుండెను. ఈసంగతి తెలిసినయెడల కుమార్తె భయపడిపోవునని అతడామెకు తనలోని మార్పును వెల్లడించలేదు. కాని అతని సంభాషణలే అతనిలోని మార్పును సూచించుచుండెను. పుష్పములను చూచినప్పుడతనికి కలుగుభావములు పూర్వమువలె సంతోషకలితములుగాక యిప్పుడు విషాదభరితములై యుండెను. శీతకాలము. చలి విపరీతముగానుండెను. రాత్రులందు వర్షముకురిసినట్లు మంచుపడుచుండెను. తోటలలో పువ్వుల ఆడావిడి తగ్గిపోయినది. గులాబిచెట్టున ఆఖరుకాపువ్వు ఒక్కటిమాత్రము మిగిలియుండెను. కాంతం దానిని కోయుటకు సిద్ధపడుచుండగనే ఒక చలిగాలి కదిలి నేలరాలిపోయినది. దాని రేకలన్నియు నున్నయిపోయినవి. ఈవిషయమంతయు జగ్గయ్య గమనించుచుండెను. అతడు "అమ్మాయీ! మనజీవితాలు కూడా ఇదేమోస్తరు. వికసించినగులాబీవలె మనంయౌవనంలో వుంటాం. కాని తక్షణమే గులాబివాడిపోతుంది. అలాగే మనయౌవనంకూడా మర్నాడే మాసిపోతుంది. అది అస్థిరము" అన్నాడు. ఈవాక్యములు కాంతం మనమును బీజాక్షరములవలె హత్తుకొనెను.

ఇంకొకప్పుడు కాంతం కొత్తగాకట్టినమళ్లలో విత్తనములను నాటుచుండెను. అదిచూచి జగ్గయ్య "మనంకూడా యీవిత్తనాలలాగే భూమిలో కలిసిపోయేకాలం వస్తుంది. కాని ఆవిషయమై అంతకంగారుపడనక్కరలేదు. ఈవిత్తనం కొద్దికాలానికి వృద్ధియై పుష్పించి ఫలవంతమగుచున్నట్లే మనంకూడా యీఅంధకారమునుండి విముక్తులమై శాశ్వతసౌఖ్యజీవితమును గడపగలదినము వస్తుంది. నేను మృత్యువువాతబడి దీర్ఘనిద్రను పొందేటప్పుడు నువ్వునాసమాధిపైని ప్రేమపూర్వకంగా నాటిన పూలచెట్లు పుష్పించడమే నేను శాశ్వతానందజీవితమున సుఖిస్తున్నాననడానికి నిదర్శనం: అదే నేను భగవంతుని సన్నిధానంలో వున్నానని తెలుసుకోడానికి నీకు ఆనవాలు" అనిపలికినాడు.

ఈమాటలామెహృదయమును కలచివేసినవి. వృద్ధునికండ్లలోకూడా అశ్రువులు ప్రత్యక్షమైనవి. అతని హృదయము కొట్టుకొనుచుండెను. అచిరకాలముననే ఈప్రపంచమున తానుఒంటరిదైపోవక తప్పదని కాంతమ్మకు తెలిసిపోయెను. దుఃఖపూరితభాగములు ముమ్మరమైపోవ నామెకూడ జనకుని ప్రక్కకూర్చొని అతనితోపాటుగ నశ్రువులరాల్చినది.

## పదునొకండవ పుష్పము: వేదన

చలికాలము పూర్తిగా ప్రవేశించినది. రాత్రులయందు చలిభరించుటకు శక్యముగాకుండెను. ఉదయము జాముప్రొద్దెక్కువఱకు మంచు తగ్గుటలేదు. జగ్గయ్యస్థితి రోజురోజు హీనమైపోవుచుండెను. క్రమముగా నతడు నీరసించిపోవుచుండెను. రామన్న సమీపగ్రామమునకుపోయి వైద్యుని తీసుకొనివచ్చెను.

వైద్యశేఖరుడగు లింగరాజు రోగినిపరీక్షించి ఔషధమిచ్చెను. అతనితోగూడ కొంతదూరముపోయి కాంతమ్మ తండ్రిస్థితినిగూర్చి ప్రశ్నించినది. ప్రస్తుతమంతట్టియపాయమును లేకపోయినను ముందుముందు క్షయ వ్యాధి ప్రవేశించుననియును, అపయున్నన రోగముకుదురుట కష్టమనియును లింగరాజు అభిప్రాయమిచ్చెను.

జనకుడు ఆరోగ్యవంతుడగుట కవకాశములేదని తెలిసినతోడనే కాంతం గుండెలు బ్రద్దలైపోయినట్లయినది. ఆమెదుఃఖము మితిమీరిపోయినది. సాయంకాల మగుసరికి కొంత ధైర్యము తెచ్చుకొని ఆమెతండ్రి సమీపమునకు వెళ్లినది. తండ్రిముందు లేనిసంతోషమును తెచ్చుకుని ఆమె అతనికి సకలోపచారములును చేయుచుండెను.

ఏనిముషమున నేమి కావలసివచ్చునోయని యామె నిత్యమును అతనిప్రక్కనే కనిపెట్టుకొనియుండెను. చూపులవల్లనే హృదయమునందలి కోరికను గ్రహించి తండ్రికి సౌఖ్యము కలిగించెడిది. ప్రతిరాత్రియును అతని దగ్గిర మెలకువగా కూర్చొనుచుండెడిది.

“ఇట్లా నువ్వుకూచుంటే జబ్బుపడి పోతావమ్మా. మనిషికి కొంతవిశ్రాంతి వుండాలి. మేముచూస్తూ వుంటాం. నువ్వోకగంటసేపుపడుకో” అని ముత్యాలు యెంతచెప్పినను ఆమె వినిపించుకొనెడిదిగాదు. ఒకవేళ బలవంతమువల్ల పడుకున్నను తండ్రికేబాధకలుగునో యను భయమున నామెకు నిద్రరాకుండెను. జగ్గయ్య ఒక్కసారి దగ్గినంతమాత్రమున నామెవణికి పోవుచుండెను. అతడు కదిలినవెంటనే దగ్గిరకుపోయి ఆతురతతో “బాబూ! ఏంకావాలి?” అని అడుగుచుండెను. అతనికి బాగా యిష్టమగు కూరలను రుచికరముగావండి పెట్టుచుండెను. పక్కదుప్పట్లను దులిపి సౌఖ్యముగా పరచుచుండెను. కథలను, పురాణములను చదివి అతనికి వినిపించుచుండెను. నీరసించిపోయిన ఆవృద్ధునిముఖమును చూచుసరి కామెకు కన్నీళ్లాగక దృష్ట్యవరోధమును కలిగించుచుండెను.

ఆనాటికానాడు హీనమైపోవుచున్న తనస్థితినిగాంచి తనకు మరణకాలము నెమ్మదిగా సమీపించుచున్నట్లు జగ్గయ్య గ్రహించెను. కాని అతడు నిర్విచారముగా సంసిద్ధుడయియుండెను. అతని మనస్సు ప్రశాంతమైయుండెను. “బాబూ!నువ్వులేకపోతే నేనెట్లాబతకడం? ఈలోకంలో నన్నాదరించేదిక్కెవరు?” అనికాంతం యేడ్చినది.

కృశించిపోయిన హస్తమును కుమార్తె వీపుపైవైచి నిమురుచు జగ్గయ్య “అమ్మా! యేడవకు. పరలోకంలో నీకొకతండ్రి వున్నాడు. నేనుగతించి పోయినను ఆతండ్రి నిన్ను విడిచిపెట్టడు. నీజీవిత మెలాగ గడుస్తుందన్న విచారమునాకులేదు. గాలిలో విహరించేపక్షులను సహితము పోషించు తండ్రి నిన్నుమాత్రము విడచిపెట్టునా? నీకుమాత్రం యేమికావాలి? పూటకు పిడికెడుఅన్నముకదా? కాబట్టి ఆవిషయమై నాకేవిచారమూలేదు. కాని యీలోకము పాపభూయిష్టము. దానిమాయలలోబడి నీమనోనైర్మల్యమును పాడు చేసుకుంటావేమోనని నాభయం. ఇప్పటివలెనే నిత్యమూ నీహృదయమును పవిత్రంగా వుంచుకుంటానని నాకు వాగ్దానంచెయ్యి. అల్లాఅయితే నేను నిశ్చింతగా చచ్చిపోతాను” అన్నాడు.

“బాబూ! ఆవిషయమై భయపడకు. నేను బతికి వున్నంతకాలమూ నీబోధనలను అనుసరించియే నా జీవితాన్ని నడుపుకుంటాను.”

## పండ్రెండవపుష్పము : మరణము

జగ్గయ్యజబ్బు హెచ్చయిపోయినది. లింగరాజు ప్రతిరోజును వచ్చిచూచుచుండెను. జగ్గయ్య అవస్థ చూచి అతనిహృదయము నీరైపోయెను. మందుఖర్చుకొరకు కాంతమ్మ కొంతడబ్బు యివ్వబోయినది కాని అతడు పుచ్చుకొన నిరాకరించెను.

కుమార్తెనిపిలిచి జగ్గయ్య "అమ్మా! ఇంక రెండురోజులుగడువుందని లింగరాజుగారుచెప్పేరు. ఈలోకపు పనులన్నీపూర్తిచేసుకున్నాను. ఈరవంతకాలమూ యింకభగవధ్యానంలో గడిపేస్తాను" అనిచెప్పెను.

నిస్సారమైన అతనికంఠస్వరమూ ఆమెకు భయముగొల్పినది. నిమిషనిమిషమునకును బిగదీసుకొనిపోవుచున్న తండ్రినిచూసి ఆమెక్రుంగిపోయినది. "బాబూ! నువ్వుచెప్పినదేనిజం. దైవంమీద భారంవేసి నిశ్చింతగావుండు" అని మాత్రంఎలాగో చెప్పినది.

మిగిలిన రోజంతయు జగ్గయ్య నిశ్చలధ్యానమున గడిపెను. తన్ను చూడవచ్చిన వారితో అతడు పూర్వమువలె సంభాషించలేదు. ఇహలోకముపై వతనికి స్మృతిలేనట్లుండెను. అనంతసౌఖ్యధామమగు స్వర్గమునకు పోవుచున్నను సంతోషమున వతనిముఖమునూ తనదివ్యతేజమును ధరించినది. అతనికనులయందానందబాష్పములు నిల్చినవి.

మంచముప్రక్కనే కూర్చొని జనకునికి మనశ్శాంతిని దయచేయుమని దుఃఖాతిరేకమున మైమరచిపోయి కాంతమ్మ ప్రార్థించినది. ఈవిచారపు దర్శనమును, భక్త్యుద్రేకమును చూచి రామన్నయును, అతని కుటుంబమును విశ్చేష్టులై నిలువబడిపోయిరి. వారిమనస్సులుకూడ ప్రార్థనానిమగ్నములైనవి. చూచినవారికండ్లశ్రుపూరితములై పోయెను.

ఈకష్టసమయమున జగ్గయ్యకేలోపమును రాకుండ రామన్నయును, భార్యయును శక్తివంచనలేక తగుసహాయమొనర్చిరి. జగ్గయ్య తమయింటికివచ్చిన రోజు మంచిదని వారుతలచుకొనుచుండిరి. అతనిదగ్గిరకి ప్రతినిమిషమువచ్చి "ఏం? ఎలాగుంది?" అని అడుగుచుండిరి. వారట్లు వచ్చినప్పుడు కాంతం దీనురాలై "ఏం? రామన్నబాబూ! బాబు బతకడానికేమేనా ఆశవుందా?" అని అడుగుచుండెను.

"అమ్మా! భయపడకు. మనమేమీచెప్పలేము. ఏమో! భగవదేచ్ఛ. వట్టేట్లో పడవలాగుంది, తల్లీ!" అని ముత్యాలు మాతృవాత్సల్యముతో పలుకుచుండెను.

ప్రతిరోజును తండ్రి ప్రక్కను కూర్చొని పుస్తకములను చదివి కాంతం వినిపించువాడుక యుండెను. జగ్గయ్యకామెకంఠరవము గంధర్వగానమువలె మధురమై వినబడుచుండెను. చివరరోజులలో భాగవతమందలి "నారాయణకవచము" ను ఎన్నిసారులో చదివించుకొని విన్నాడు.

మహాభాగవత గ్రంథమును తలవద్దపెట్టుకుని అతడు పడుకున్నాడు. కొంతసేపైనతరువాత అతడు మరల "అమ్మా! కాంతం! ఎంతప్రయాసతో నాకుఉపచారాలుచేస్తున్నావు? తల్లీ! నాకీజబ్బువొచ్చింది మొదలు నిద్రాహారాలు లేవుగదా నాయనా! నాకడుపునపుట్టి ఏమిసుఖపడ్డావు? నీవునాయందు చూపిన అపారప్రేమకు నేను కృతజ్ఞుడను. పితృవిధేయులగువారికిలభించే పుణ్యలోకములు నీకు లభించుగాక! ఈస్థితిలో ఆశీర్వాదములుగాక వేరేమి నేనియ్యగలను? కాని నాఆశీస్సుమాత్రం వృథాపోదని నిశ్చయంగా చెప్పగలను. సంతోషితులగు పితరుల ఆశీస్సులకంటె బిడ్డలకు మహదైశ్వర్యములైననూ గొప్పకావు. ఈమహాగ్రంథాన్ని తీసుకు దాచుకో. పరలోకయాత్రాసమయంలో నేను నీకిచ్చిన బహుమానమిదిఒక్కటే."

తెల్లవారుజామున జగ్గయ్యకు అయాసమధికమైపోయినది. ఇతరులాడు మాటలతనికి వినబడుటలేదు. నాడీచలనముసరిగాలేదు. అతిప్రయాసతో జగ్గయ్య "అమ్మా! నేనుపోతున్నాను. సెలవియ్యి. ఏదితల్లీ! ఆఖరు

సారి నీముద్దుమొగంచూడనీ.'' కుమార్తెముఖమును తనముఖముపై చేర్చుకున్నాడతడు. ఇద్దరికిని అశ్రుప్రవాహము ఆప శక్యముగాకుండెను. కొంతసేపైనతరువాత అతడు "అమ్మా! శక్తిక్షీణించిపోతూంది. మాటాడలేను. ఆయాసం'' అన్నాడు. జగ్గయ్య కాళ్లును చేతులును చల్లబడిపోయినవి. కండ్లుతిరిగిపోవుచుండెను. పవిత్రజీవనుడగు జగ్గయ్య యిహలోకదుఃఖములకు స్వస్తిచెప్పి శాశ్వతసౌఖ్యనిలయమగు స్వర్గమును చేరుకున్నాడు.

మరణమన నేమియో కాంతమ్మ యెరుగదు. నీరసముచేత నతడు మూర్ఛపోయినాడనుకున్నదామె. అంతలో ఆతడు చనిపోవునని ఆమె అనుకొనలేదు. కాని ఆదృశ్య మామెను భయకంపితురాలి నొనర్చినది. ఆమె కెవ్వున కేక వేసినది. అదివిని రామయ్యకుటుంబ మంతయును లేచి ఆతురతతో పరుగెత్తుకొనివచ్చిరి. వారు రోగినిపరీక్షించి చనిపోయినట్లు చెప్పువరకును కాంతమ్మ కాసంగతి తెలియదు. కొయ్యబారిపోయిన ఆకళేబరమును కౌగిలించుకొని చూచువారిహృదయములు నీరగునట్లు కాంతమ్మ యేడ్చినది: "బాబూ! నీఋణం యెల్లాతీర్చుకోగలను? చిన్నప్పటి నుంచీ నేలదించకుండా నన్నుఎత్తుకున్న యీచేతులిప్పుడిల్లాపడివుండిపోయిన వేమి? పుట్టినది మొదలు నన్ను బాగుచెయ్యడంలోనే అరిగిపోయిన యీచేతులను ఒక్కసారి ముద్దు పెట్టుకోనీ! బాల్యంలో అజ్ఞానంచేత నీమనస్సుకి బాధకలిగించినట్లయితే క్షమించు, తండ్రీ!" —కొదువ.

## నా ప్రేయసి

సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారు

ఆలలన నెమ్మొగంబౌకపూలతోఁట
అందుఁగలపువ్వులుంబండ్లు ననుదినంబుఁ
గాన్కగానాకుఁబంపును గాని తాను
లక్షవరహాలొసంగిన లాఁతికిడదు.

ఆలలిలగాత్ర మొక్కరత్నాలరాశి
యన్యులకులోభనీయంబయగునుగాని
దానివెలఁగట్టగాలేను నేనుదక్క
దానిఁగొనలేఁడన్యుండు నేనుదక్క.

ఆరమణిచిత్త మనురాగమారుతంబు
మలయునంతఃపురోద్యానమండపంబు
అటకుఁజన నాకుమాత్రంబె యాజ్ఞగలదు
పరులుచొరకుండ మూయఁగాఁబడునుదలుపు.

ఆవనితమోవియందు లాస్యంబుసేయు
చున్నచిఱునగవమృతంపుజున్ను నాకుఁ
గానఁబడుఁగాని పరులకుఁగానఁబడదు
పుట్లకొలఁదిపుణ్యంబు సల్పుకొనియుంట.

## ప్రకృతిరాగము

అల్లూరి లక్ష్మీకాంతరావుగారు

స్వామి! నీవెన్నడో హిమాచలముపైన
మురళివాయించినావేమొ మోహనముగ
కాన నామంచుకొండతాఁగరగిపోయి
వరదలై పారి మటిమటివకదలొచు
ఎటకొ, పడిపోవుచుండె నదేరికెఱుక?
పాడగా, పాడగా నీవుగూడ స్వామి!
తన్మయత్వంబజెందితో, తనువెమరచి

ఆప్రవాహానలీనమైనావొ, కాక
ఎచ్చటిదినీలవర్ణ విహారగలను?
హర్షముప్పొంగజేయు మదాత్మలోన
వీణె యాసమయమందు నీవ్రేళ్లనుండి
జారిపడిపోయెనో నీటిజాలులోన
గాక, యెచ్చటివోయి శృంగారమైన
గానవాదము లీతరంగములలోన?

# పూలసజ్జ

కాళ్లూరి వేంకటరామారావుగారు

## పదమూడవపుష్పము: కష్టపరంపర

జగ్గయ్యచనిపోయిన ఆయిదారేండ్లలో "లక్ష్మీవిలాసము"నందనేకమార్పులుజరిగినవి. రామన్న కుమారుడు గంగన్న పెద్దవాడైనాడు. రామన్నకు గంగన్నఒక్కడే కుమారుడు. అతడు మర్యాదగల యువకుడే కాని దురదృష్టవశమున అతనికొకగయ్యాళిభార్య దొరికినది. ఆమెపేరు రంగమ్మ.

రంగమ్మ కొంచెము పట్నవాసపుపిల్ల. విలాసవతి. ధనవంతులబిడ్డ. ఆమెమూలమున కుమారునికి విశేష ధనలాభముండునని రామన్నకుమారున కామెను పెండ్లిచేసెను. ప్రపంచమునందు తనపాటి అందకత్తెలేదని ఆమెకొకభ్రమ మొదటినుండియు కలదు. దీనికితోడు ధనకాంక్ష యెక్కువ. ఏదియెట్లున్నను ధనమే ప్రధానముగాని పరువు మర్యాదలతోడ నామెకు నిమిత్తములేదు. ఆమెముఖమునందు సౌందర్యలక్షణములున్న మాట నిజము. కాని గర్వమును, లోభత్వమును ,అహంకారమునుకలిసి ఆముఖమెప్పుడును ధుమధుమలాడుచుండును.

అత్తవారింటికి వచ్చినదిమొదలధికారమంతయు నామెదైపోయెను. రామన్న వృద్ధుడైపోవుటవలన పనిచేయలేకుండెను. కోడలువచ్చినవెంటనే అత్తమామలను వేరుపెట్టినది. వారిభోజనములకు కావలసిన పదార్థముల నామెయే యిచ్చుచుండెను. తనమాటలేనిదే పొలములోపండినకూరలైనను తన అత్తమామల కెవ్వరును పెట్టకూడదని పాలికాపులను రంగమ్మ ఆజ్ఞాపించినది. అవృద్ధులను ఎన్నివిధములబాధించవలెనో అన్నియును ఆలోచించి ఏడిపించుచుండెను. తమఆఖరురోజు లీరీతిని తీరనిదుఃఖభాజనములైపోయినందుకు లోలోపలనే వారుకుళ్లిపోవుచుండిరి. రామన్న ఖిన్నుడైపోయి నలుగురిలోను తలయెత్తుకునితిరుగలేకుండెను.

గంగన్నకుమాత్రము సౌఖ్యమెక్కడిది? తలిదండ్రులకంటె రెట్టింపుగ నతడాగయ్యాళిమూలమున బాధపడుచుండెను. అతడు మాట్లాడుటయేతడవుగ రంగమ్మ ఎన్నోతప్పులుపట్టి సాధించుచుండెను. ఇంటిపనులలో నేమాత్రము లోటుచేసినను భర్తఅని చూడకుండ అనరానిమాటలును అతని ననుచుండెను. ఎప్పుడును వితండవాదనలతోడనే ఆమెకు కాలక్షేపముజరుగుచుండెను.

తలిదండ్రులతోకూర్చొని మాట్లాడుచుండగా చూచినయెడల గంగన్నకు తలవాచునట్లుగా చీవాట్లు భార్యవలనతగిలివవన్నమాటే. "నాకన్నుచాటుచేసి ముసిలాళ్లకి సొమ్మంతా పెట్టేస్తున్నావు" అని రంగమ్మ కండ్లెఱ్ఱచేయుసరికి సాధుహృదయుడగు గంగన్న గడగడలాడిపోవుచుండెను. సాయంత్రము పని పూర్తిచేసుకుని ఒక్కసారి జననీజనకులప్రక్కను కూర్చొనవలెనని అతడు అభిలాషపడెడువాడు, కాని అతని కాధైర్యము లేదు. అతని సామర్థ్యము భార్యవద్ద పనికిరాలేదు. కన్నీరుగార్చుకొనుచు ఒకరిప్రక్కనొకరు కూర్చొని యేడ్చుచుండు తలిదండ్రులనుచూచునరి కతనిగుండె చెరువగుచుండెను. సమయముదొరికినప్పుడు వారిదగ్గరకు పోయి తననిర్భాగ్యవిధికి దుఃఖించి అశ్రువులరాల్చెడివాడు గంగన్న.

"నాయనా! ప్రపంచకంసంగతే అంతేనుమా! నీభార్య డబ్బుచూసేసరికి మీఅమ్మ భ్రమసిపోయింది. ఆమెసౌందర్యాన్ని చూసి మోసపోయేవునువ్వు. మీయిద్దరికీ లొంగిపోయినాను నేను. జగ్గయ్య అప్పుడుచెప్పిన మాటలువింటే మనకీపాట్లురాకపోవును. జగ్గయ్యవంటిజ్ఞానిని నేనుచూడలేదురా బాబూ! ఈసంబంధంచెయ్యొద్దని చెవిని యిల్లుకట్టుకుని పోరేడుకదా జగ్గయ్య. అతనిమాట లిప్పటికీ నాచెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వున్నాయి.

"సొమ్ముసొమ్మంటే లాభంలేదమ్మా! కోడలువల్ల సొమ్ముపస్తాందని పొంగిపోతున్నారుకాని మీరు అంధులైపోయి సర్వేశ్వరుణ్ణి మరిచిపోతారన్నసంగతి మానుకోకుండావున్నారు. మీకు దబ్బాశయెందుకు? మీకు కావలసినంతకంటె అధికంగానే భగవంతుడు దయచేశాడు. కాస్త నిదానించి మరీచేసుకోండి. అని జగ్గయ్య మీఅమ్మతో ఎన్నోసార్లు చెప్పేడుకాని మనకామాటలు చెవిదూరలేదు. ఆహా! అమూల్యస్నేహితుడు లేకపోవడం యెంతలోటుగావుంది. అయ్యో! జగ్గయ్యా! కష్టకాలంలో నన్ను యిల్లావొదిలిపెట్టి పోయావా?" అనివల్క్కుచు రామన్న అశ్రువులరాల్చెను.

పైవిధమున నానిర్భాగ్యులుముగ్గురును తరుచు సంభాషించుకొనుచుండిరి.

వారిగతియే యిట్లుండునపుడు కాంతంమాట అడుగవలెనా? ఆమె నిజముగా భూలోకనరక మనుభవించుచుండెనని చెప్పవచ్చును. జగ్గయ్య పూర్వము నివసించుచుండినయింటియందు ప్రస్తుతము రామన్న కాపురముండెను. అందుచే కాంతమ్మ కొకమారుమూలవసారాగదిని రంగమ్మయిచ్చినది. తరుచు వృద్ధులసమీపమున నుండి వారిసౌఖ్యములు గనిపెట్టుచుండినందువలన కాంతమ్మగూడ రంగమ్మ ఆగ్రహమునకు గురియయ్యెను.

కనబడినప్పుడెల్లను కాంతమ్మకుతిట్లు తప్పకుండెను. ఏపనిని ఎంతసొగసుగాచేసినను అందులో రంగమ్మకి తప్పులు కనబడుచునేయుండును. ఉదయముమొదలు సాయంకాలముపరకును కాంతం కష్టపడి పనిచేసినను రంగమ్మ కామె యేపనియును చేయలేదన్నమాటే. "పోతులాగుతింటావుకాని పనిముట్టుకోవు. మాకెక్కడదాపరించినావే దిక్కుమాలినదానా!" ఇవియే ఆనిర్భాగ్యురాలికి బహూకరింపులు.

తనయెడల రంగమ్మకి అసహ్యముకలిగినదని ఆదిక్కుమాలినపక్షి గ్రహించినది. రామన్న ఆమెను ఓదార్పుస్థితిలోలేడు. అతనిబాధలే అతనిని ముంచివేయునన్నియుండెను. కాంతం యెక్కడికైనను పోవలెనని యనుకొనెను. కాని యెక్కడికిపోవుటయో ఆమెకే తెలియకుండెను. ఇట్టిస్థితియందు లింగరాజు నామె సలహాయడిగినది.

"అమ్మా! నువ్వు యిక్కడవుండడం అసందర్భమేనని ఒప్పుకుంటాను. కాని యీతక్షణం యిక్కడనుండివెళ్లడం నాఅభిప్రాయంకాదు. గౌరవనీయమైనపనిని చెయ్యడానికే నువ్వు అర్హురాలవుకాని నిత్యమూ పాలంపనిలోతిరగడానికి నీకు శక్తిచాలదు. కాని కొంత ఓర్పుకునివుండాలి. ఆమహాత్ముని నమ్మి ప్రార్థించుకుంటూవుండు. ఈపరీక్షలను నెమ్మదిగా భరించు"అని లింగరాజు బోధించినాడు.

ఈఆపదలమధ్య నామెకు మనశ్శాంతిగలిగించుస్థలమొక్కటిమాత్రముకలదు. తండ్రిసమాధిదగ్గరకుపోయి కూర్చొనగానే ఆమె తనదుఃఖములను మరిచిపోవుచుండెను. జనకునిసన్నిధిమన్నట్లే ఆమెకు తోచుచుండెను. ఆతనియమూల్యబోధనలను తలపునకుతెచ్చుకొనుచు నామె తరుచు సమాధిచెంతనే కాలముగడుపుచుండెడిది.

## పదునాలుగవపుష్పము: అంత్యపరీక్ష

జగ్గయ్యగతించి ఆరేండ్లుగడిచిపోయినవి. ఆనా డతనిసప్తమవర్ధంతిదినము. రోజాకంటె కాంతమ్మ కానాడు దుఃఖము తలమున్కలైపోయినది. ప్రభాతభానుని అరుణకాంతు లామెగదిలోనికి ప్రవేశించుచుండెను. నిత్యానందప్రదమగు సూర్యోదయము నాడామెకు సంతోషదాయకముగ గన్పట్టలేదు. నిరుత్సాహముతో కాంతమ్మలేచి జనకునిసమాధిని అలంకరించుటకు పూనుకున్నది.

తనదురవస్థకంతకును కారణమైన పూలసజ్జ ఆమెకెదురుగ కిటికీలో కనబడుచుండెను. ఆసజ్జనిండను రంగురంగులపువ్వులనుయేరి కాంతమ్మపెట్టినది. తిన్నగా సమాధివద్దకుపోయి ఆసజ్జను దానిమీదవుంచినది. ఆమెయశ్రువు లాపుష్పములపైబడి హిమబిందువులవలె మెరయుచుండెను.

"బాబూ! బాబూ! ఈపువ్వులమాలాన్నే నీవు నాకు జ్ఞానముబోధించేవాడివి. అందుకు కృతజ్ఞురాలనై నీసమాధిని అలంకరిస్తున్నాను. ఎలాంటికష్టాల్లోనైనా నీచేతుల్లోవున్నప్పుడు నేను నిర్విచారంగా ఉండేదాన్ని. ఇప్పుడో? నీకుమార్తె దిక్కుమాలిపోయి నీసమాధియుందరే నేలకీకంటికీ యేకధారగా ఏడుస్తూంది. వన్నోదార్చేవారులేరు. బాబూ! కాలులో రవంతముల్లుగుచ్చుకుంటే నాకోసమని హడిలిపోయేవాడివికదా! నాబాధలుచూపి నీఆత్మ ఎంతదుఃఖిస్తూందో యేం తెలుస్తుంది? నేనూకొద్దిరోజుల్లో నీదగ్గరకే వస్తున్నానులే. అబ్బా! ఈబాధ నేను భరించలేను."

కాంతమ్మ తండ్రినితలచుకుని చాలసేపు ఏడ్చినది. దారిపోవువారామె పితృభక్తినిగాంచి సంతోషాశ్రువులు రాల్చిరి.

ఆమరునాడు "లక్ష్మీవిలాసము" లోనివారందరును యధాప్రకారము పొలముపనికిపోయిరి. ఆసమయమున రంగమ్మ తనపట్టుచీరను దొడ్లోయెండవేసినది. మరికొంతసేపటి కాచీర హఠాత్తుగా కనబడకుండపోయినది. బాగుగా సాయంకాలమైపోయినతరువాతగాని చీరపోయినసంగతి రంగమ్మ కనిపెట్టలేదు. తక్షణమే కాంతమ్మపైని అనుమానపడి ఆమెనుదూషించుటకు మొదలిడినది.

నిర్మలమానసుడగు జగ్గయ్య ధర్మవరదుర్గమునజరిగిన ఉంగరపువృత్తాంతమంతయు రామన్నతో దాచకుండ చెప్పివేసెను. అతడు రామన్నతో చెప్పుచుండగా గంగన్న అక్కడేయుండి దానినంతవినివున్నాడు. అత దూరుకోనక యీసంగతిని భార్యతో చెప్పినాడు. అందుచేత రంగమ్మకు విధిగా కాంతమ్మపైనే అనుమానము కలిగినది.

సాయంకాలము మామూలుగా పనివాండ్రందరితోడను కాంతమ్మ యింటికివచ్చినది. వెంటనే రంగమ్మ లోపలినుండివచ్చి కాంతమ్మనుఅడ్డమైన తిట్లునుతిట్టి "తక్షణం చీరతీసుకురా. ఏం? అల్లాచూస్తావేం? లేకపోతే నీపనిపట్టిస్తాను. చూడు" అని కసిరికొట్టినది.

"అమ్మా! నేను రోజంతా పొలంలోనేవుండి భోజనానికైనా యింటికిరాలేదు. అలాంటప్పుడు నేను చీరతీశానవడంకంటె అన్యాయం మేొకటిలేదు. ఏదారిపోయేవాడైనా నిముషంలో దాన్ని దొంగిలించివుండొచ్చు" అని కాంతం చెప్పినది. కాని రంగమ్మ కోపోద్రేకమున శరీరమును మరచిపోయియుండెను. "ఛీ! దొంగపీనుగా! నీసంగతి తెలియదనుకున్నావుకాబోలు! ఉంగరంభోగట్టా యావత్తును మాకు తెలుసును. వాళ్లుతగిలేస్తే యిక్కడికి చేరేవు. నీలాంటివాళ్లింట్లోవుండడం ప్రమాదంకూడాను. పో. తక్షణమే మాయింట్లోనించిపో" అని ఖండితముగా చెప్పివేసినది.

"పాపం రోజల్లా మనతోపాటు ఎండలోపనిచేసి యీసాయంకాలం యెక్కడికిపోతుంది? ఈరాత్రికెక్కడ భోంచెయ్యాలి. అలిసిపోయివుంది పాపం! అంతగా నువ్వు పట్టుపడితే పొద్దుటే వెళ్లిపోతుందిలే" అని గంగన్న చాలాదూరముచెప్పెను.

"ఒక్కగంటైనా యిక్కడవుండడానికి వీల్లేదు. నీకవసరంలేనిపనుల్లోకి నువ్వురాకు. వూరుకో" అని రంగమ్మ భర్తపై కోపపడినది.

మాటలాడినకొలదియు నామె దుర్మార్గము వృద్ధిపొందుటతప్ప లాభములేదని గంగన్న మారుమాటాడలేదు. కాంతమ్మ వేరుజవాబుచెప్పకుండ తనవస్తువులనన్నిటిని మూటగట్టుకుని బయలుదేరినది. లక్ష్మీవిలాసములోనివారందరికిని తన కృతజ్ఞతను తెలియచేసినది.

జరిగినసంగతినివిని వృద్ధులు మిగుల విచారించిరి. ఇద్దరును ఆమెనెంతోసేపు ఓదార్చిరి. కడపెట్టెలోవున్న రెండురూపాయలనుతీసి ఉదారస్వభావుడగు రామన్న ఆమెకు ఖర్చులకని యిచ్చివేసెను. "అమ్మా!

978

వెళ్లు. భగవంతుడు నిన్ను సర్వదా రక్షించుగాక! మీబాబుఆశీర్వచనం అమోఘము. కొద్దిరోజుల్లోనే నీఆపదలుపోయి సౌఖ్యపడగలవు. ఈనీకష్టంచూడకుండా మమ్మలినికూడా జగ్గయ్యతోపాటు భగవంతుడు తీసుకళ్లేడుకాదు" అని రామన్న ఏడ్చెను.

పడమట నింకను రెండుగడియలప్రొద్దుమాత్రముండెను. జీవకోటులన్నియును పనులనుముగించుకుని గృహోన్ముఖములగుచుండెను. భయంకరమగుకారుచీకటులు క్రమ్మకున్నప్పుడు తలదాచుకొనుటకు చరాచర జంతుజాలములన్నియు స్థావులను జూచుకొనుచుండెను. కాని అభాగినియగు కాంతమ్మకుమాత్రము నీడలేదు.

బట్టలమూటబట్టుకొని ఆమె బయలుదేరినది. ఒక్కసారి జనకునిసమాధిని చూడవలయునని యామెకు బుద్ధిపుట్టెను. మెల్ల మెల్లగ కాళ్లీడ్చుకొనుచు నామె స్మశానవాటికను చేరుకొనెను. అప్పటికప్పుడే సూర్యాస్తమయమైపోయినను చీకటులు వ్యాప్తినందలేదు. స్మశానభూమియందాబాలికకు భయముకలుగలేదు. అక్కడి సమాధులన్నియు పిశాచరూపములధరించి ఆగాఢనిశ్శబ్దమందు జ్ఞానహీనులగు మానవులనుచూచి వికటాట్టహాస మొనర్చుచున్నట్లుగనుండెను. కాంతం తండ్రిసమాధిచేరినది. ఆపరాకుండ నామె కన్నీరుస్రవించుచుండెను.

సమాధిప్రక్కనేకూర్చొని కాంతం "బాబూ! ఈనాకష్టాలుచూడకుండా దైవం నిన్ను తీసుకుపోయాడు. ప్రపంచకంలోని విపత్తులకతీతుడవై మహాసౌఖ్యంలోవున్నావిప్పుడు. నేనిప్పుడెక్కడికి పోగలను? ధర్మవరదుర్గమునుండి తరిమివేసినప్పుడు నువ్వు నాపక్కనేవుండి కంటికిరెప్పలాగు చూసుకున్నావు నన్ను! ఇప్పుడెవ్వరున్నారు? దిక్కుమాలినదాననై, అపవాదభారముచేత కుంగిపోయి కటికదరిద్రంలో యీమో స్తరుగా తిరుగాడుతున్నాను. ఏదిరెల్లాగున్నా రోజూ నీసమాధిప్రక్కనికూచుని నామనోవ్యథ వెల్లడించుకుంటే కాస్తమనశ్శాంతికుదిరేది. ఇప్పుడు దీనికికూడా నేను పెట్టిపుట్టలేదు" అని యేడ్చినది.

సంజెచీకటులు నతిక్రమించి మేఘముల తెరలనుదాటుకుని త్రయోదశీచంద్రకాంతి స్వచ్ఛమై ప్రపంచకముపై ప్రసరించుచుండెను. కాంతం నలుప్రక్కలను కలయచూచినది. అంతటను గాఢనిశ్శబ్దము. "ఇప్పుడు నేనెక్కడికిపోగలను? ఇంతరాత్రివేళ ఎవరింటికివెళ్ల డానికీ నామనస్సు ఒప్పుకోవడంలేదు. నేను ఇల్లారావడానికి కారణంచెప్పినతరవాత నన్ను ఎవరుచేరదీసి ఆదరిస్తారు? ఇదుగో! ఈపక్కనేకూచుని మాబాబు సమాధిపక్కనే యీరాత్రిగడిపేస్తాను. బహుశా యీపవిత్రస్థలాన్నిసందర్శించేభాగ్యం నాకు యింక కలగదు కాబోలు! ఉదయాన్నే లేచి దైవంమీదభారంవేసి విశాలప్రపంచకంలో దైవనిర్ణీతమగుస్థలాన్ని అన్వేషించుకుంటూపోతాను" అని ఆమె నిశ్చయించుకున్నది.

కుప్పించిపోయి రక్తహీనతచేపాలిపోయినబక్కశరీరమును గోడకుచేరవేసుకుని మూట తలక్రిందపెట్టుకుని స్మశానభూమిలోనే, తండ్రి సమాధిప్రక్కనే కాంతమ్మ విశ్రమించినది. ఆమె పైటకొంగంతయును అశ్రుధారలచే తడిసిపోయినది. హృదయమాందోళనాభరితమైయుండెను. నిశ్చలభక్తిపూరితురాలై ఆమందభాగ్యురాలు సర్వేశ్వరుని ప్రార్థించినది. భక్త్యుద్రేకమున ఆమె మైమరచిపోయియుండెను. ఆస్థితిని వర్ణించుటకు భాషకు శక్తిచాలదు.

ఒక్కనిముషమట్లు పడుకుని హఠాత్తుగా లేచికూర్చుని ఆవేశముతో చేతులుజోడించుకుని "తండ్రీ! దీనజనశరణ్యా! నామొరవినవేమి? రావేమి? తండ్రీ! నాకు దారిచూపించవా?" అని ఉన్మాదినివోలె కంఠమెత్తి శూన్యవాతావరణమును ప్రశ్నించినది. భగవంతుడు తనయెదుటనిలుచున్నట్లే ఆమె భావించుకొనెను. హృదయవిదారణమగు నామె యాక్రందనధ్వని ఆగంభీరనిశ్శబ్దమును చీల్చుకుని కంచుగంటలమ్రోతవలె స్మశానము నెల్లెడలను ప్రతిధ్వనించెను. వేటగానిచేతులలోచిక్కి జీవితాశలేక ఆక్రోశించు చిలకఅరుపువలెనుండెను ఆమెకేక.

# పూలసజ్జ

కాళ్ళూరి వేంకటరామారావుగారు

ఆమె తనప్రార్థనను పూర్తిచెయ్యకముందే సమీపమునుండి ఎవరో సుపరిచితమగు కంఠస్వరముతో "కాంతం! కాంతం!"అని పిలిచినట్లయ్యెను. భయకంపితురాలై కాంతం నలువంకలను కలయచూచినది. అనతి దూరముననే నిర్మలచంద్రకాంతియందొక సుందరస్వరూప మామెకు గోచరించెను. ఆశ్చర్యాశ్చర్యభరితురాలై కాంతం "ఆఁ—ఏమిటీ! అమ్మాజీయే! ఇంతరాత్రివేళ యీస్మశానానికి యెల్లావొచ్చారమ్మా?" అని ప్రశ్నించింది. అమ్మాజీ కాంతమ్మను లేవదీసి ఆలింగన మొనర్చుకున్నది.

## పదునారవ పుష్పము: పరమేశ్వరలీల

"కాంతం! భగవంతుడు నిజంగా మీయెడల వున్నాడుసుమా! మీరునిర్దోషులని తెలిసినతక్షణమే మాకు సౌఖ్యంలేకుండాపోయింది. నీకోసమని ఎన్నిసార్లు ఏడిచానో నీకు తెలియదు కాంతం! నువ్వూ, జగ్గయ్యా నిత్యము నాదృష్టిలోనే వుండేవారు. మీకోసమని నాన్నగారు చాలాచోట్ల వెతికించేరు. కాని మీజాడ యెక్కడా దొరికిందికాదు. మేము యీప్రాంతాలకివచ్చి మూడురోజులయినది. ఇక్కడికి సమీపములోనే మాకొకతోటవుంది. అందులో మామేడవుంది నువ్వుచూశావో లేదోకాని. గత పదిసంవత్సరాలనుంచీ నాన్నగారు ఈతోటను చూడలేదట. అందుకని ఒకసారిచూడ్డానికి యీప్రయాణం పెట్టుకున్నాం. ఈరోజల్లా ప్రమాదమైనవడగాడ్పు కొడుతూందికదూ. వీథిలోకిరాలేకపోయాం. కాని సాయంకాలమవనిచ్చి ఒక్కసారి షికారుగావద్దామని అమ్మని అడిగియిల్లావొచ్చేను. నాతోకూడా మాతోటగుమాస్తా కుమార్తెవొచ్చింది.

మేం చాలా సంగతులు మాట్లాడుకొంటూ, యీకొండలూ గెడ్డలూ చూసుకుంటూ యీస్మశానందగ్గిరకొచ్చేం. అప్పుడు నాతోవున్న మాగుమాస్తాకూతురు నాతో "అమ్మా! ఇక్కడ ఒకపవిత్రజీవనుడగు వృద్ధుని సమాధివుంది చూపిస్తానురండి. అదేమంతగొప్ప భవనంకాదుగాని అతడీప్రాంతాలకువొచ్చిన ఈఅయిదారేళ్ల లోనూ మాకందరికీ గౌరవనీయుడైపోయినాడు"అన్నది. మేమిద్దరమూ సమాధిదగ్గిరకి వెళ్లి చూతుముకదా నాఆశ్చర్యమేమి చెప్పను? స్తంభితురాలనైపోయి అలాగే నిలబడిపోయాను. మీపూలసజ్జ ఆసమాధిమీద కనబడింది. ఇంకా దగ్గిరకివెళ్లి చూసేసరికి దానిమీద మీబాబు అల్లిన నాపేరుకూడా కనబడ్డది. దానితో నాసందేహము పూర్తిగా తొలిగిపోయినది. అప్పుడు మాగుమాస్తాకుమార్తెని అడిగి మీభోగట్టాఅంతా తెలుసుకున్నాను. ఆమె తక్షణంనన్ను లింగరాజుగారింటికి తీసుకెళ్లింది. అతడు బహుపెద్దమనిషిసుమా! అతడు కూడా మీసంగతిఅంతా నాకుచెప్పేడు. మీసద్గుణాలనుగురించి అతడు నాతో చాలాదూరంచెప్పేడు. ఆవెంటనే లక్ష్మీవిలాసమునకు వచ్చినిన్నుచూడాలనుకున్నాను. కాని అప్పటికప్పుడే పొద్దుపోయింది. రేపు ఉదయాన్నే మాప్రయాణం. ఎలాగైనా నేను కాంతాన్ని ఇప్పుడుచూసితీరాలి లేకపోతే మరిచూడ్డమేపడదు. ఏంచెయ్యమంటారు? అని నేను లింగరాజుగారినిఅడిగాను. అప్పుడాయన నౌఖరునిపిలిచి నిన్నుతీసుకురమ్మని చెప్పేరు. ఆనౌఖరు "ఎందుకూ? ఆముసలాయనకూతురేనా? తండ్రిసమాధిదగ్గిర కూచుని యేడుస్తూవుండగా పావుగంటకిందటే చూశాను. అయ్యో! దుఃఖంచేత ఆఅమ్మాయికి మతిపోయేటట్లుగా కనబడుతోంది" అని చెప్పేడు. ఆమాటవినగానే నేను సమాధిదగ్గిరకి వచ్చేను. ఈసంగతిఅంతా మావాళ్లకుచెప్పమని లింగరాజుగారిని మాతోటలోకి పంపించేను.

పున్న నీకు భయంకరశత్రురాలు సుమా! నిన్ను నాప్రేమకి దూరంచెయ్యడమే దానిముఖ్యోద్దేశం. నీమూలాన్ని నాకుదానిమీదవుండే ప్రేమపోతుందని అది భయపడినది. తనస్థానం సుస్థిరంచేసుకోడానికని 1078

అదిఎంతలేనీ ఘోరాలైనా చేసేసింది. ఈవుద్దేశంతోటే అదిలేనిపోని అబద్ధాలుకల్పించి కోర్టులో చెప్పేసింది. కాని చివరకిఅది తీసుకున్న గోతులో అదేపడిపోయింది. దాన్ని కోటలోనించితగిలెయ్యడానికి దాని అబద్ధాలే కారణం.నిన్ను కోటలోనుంచి తగిలెయ్యాలని దానిఆలోచన. నీశిక్షవిని అదిసంతోషించింది. ఆఉత్సాహంలో ఈసజ్జనితీసుకొచ్చి నీమీద విసిరికొట్టేసింది. కాని ఈసజ్జయే చివరకి మనలను కలుపుతుందని అప్పుడదిఅనుకోలేదు. మనం దైవాన్ని నమ్ముకున్నప్పుడు మన కేఅపాయమూ రాదుసుమా. మనకష్టాలమూలాన్న సౌఖ్యంకూడా వొస్తుందన్న మాట అబద్ధంకాదు. కాని యీసంగతంతా నీకు చెప్పేను గనక నువ్వు ఈరాత్రివేళ యిక్కడ ఏడుస్తూ కూర్చోడానికి కారణంచెప్పుఅని అడిగినది.

కాంతం తనకథనంతను చెప్పినది. అమ్మాజీ ఆశ్చర్యచకితురాలై తనవిచారమును వెలిబుచ్చినది. "నువ్వు దీనదశలోనున్నప్పుడు, సర్వేశ్వరసహాయం కోరుతున్నప్పుడు నిన్ను నేను కలుసుకోవాలని అతండ్రి ఆజ్ఞ అయివుంది. నిన్ను యింట్లోనించి తరిమివెయ్యగానే నీకు మహాకష్టంకలుగుతుందేమో అనుకుంది పాపంరంగమ్మ! కాని యేంజరిగింది? నీకు సౌఖ్యంకలిగించడానికి తొందరపడుతూవున్న మాచేతుల్లోకి అప్పజెప్పింది. కాని మనంపోవాలి రా, నాన్నగారూవారూ కనిపెట్టుకునివుంటారు. రేపేమనం ఇక్కడినుంచి కోటకివెళ్లిపోవడం."

జనకునిసమాధి నికెన్నడునుచూచు భాగ్యముకలుగదు కదాయని కాంతం దుఃఖించినది. అమ్మాజీ బలవంతముపైని యెట్లోఆమె స్మశానభూమినివీడి మెల్లిగనడువసాగినది. అమ్మాజీ కాంతంచెయ్యి పట్టుకుని తనతోతీసుకొని వెళ్లుచు కాంతం! రా! నీతో ఆసజ్జనికూడా తీసుకురా! నీతండ్రి జ్ఞాపకార్థంఅది మనదగ్గిర వుంటుంది. నువ్వుపవిత్రభక్తితో యీసజ్జనువుంచి యీసమాధిని అలంకరించేవు. కాని అంతకంటే స్థిరమైన సమాధిని మేముకట్టిస్తాములే. ఇంక మాకు వుంగరం యెల్లాదొరికిందో వినాలని నీకు తొందరగావుండొచ్చు. రా! వెళుతూ వెళుతూ దారిలో చెబుతాను"అన్నది.

## పదునేడవపుష్పము: ఉంగరము దొరికినకథ

అమ్మాజీచెప్పుట మొదలుపెట్టినది. "గతవేసవిలోజరిగిన సంగతి. ఒకనాటిరాత్రి భయంకరమైన గాలివాన రేగింది. కోటలోవెనక దేవిడీదగ్గిరవున్న పెద్దమర్రిచెట్టు నీకుజ్ఞాపకంవుందా? అది యేనాటినుంచిఅక్కడ వుందో మాముత్తాతలుకూడా యెరగరట! ఆరాత్రితుపాను ఉరవడికామర్రిచెట్టు ఒకవేపుకి పూర్తిగా ఒరిగిపోయినది. అది ఏనిముషాన్ని ఎవరిమీదపడుతుందో అని మాకుభయంవేసింది. అందుచేత ఆచెట్టును నరికెయ్యమని నాన్నగారు ఆజ్ఞాపించేరు. కోటలోని నౌఖరులంతా చెట్టుదగ్గిరవుండి భవనాలకుగాని చుట్టూవున్న యితరచెట్లకుగాని హానిరాకుండా తగినకట్టుబాట్లుచేశారు. మర్రిచెట్టు పడిపోయింది. నేనూ, అమ్మా, నాన్నగారూ-కోటలో ప్రతివాళ్లూ-ఆచెట్టునుచూడ్డానికి అక్కడికి వొచ్చేము. మాతమ్ములిద్దరూ చెట్టు కొమ్మలమీదికెక్కి అక్కడవున్న కాకిగూడు తియ్యడానికి ప్రయత్నించేరు. చిన్నప్పటినుంచీ ఆగూట్లో యేముందో చూడాలనేకోరిక వాళ్లకివుంది. వాళ్లుమెల్లిగా గూటిదగ్గిరకిచేరేరు. అప్పుడు మాపెద్దతమ్ముడికి గూట్లో యేదో మెరుస్తున్నట్లుగా కనబడింది. "అదేమిటే? ఆపుల్లలమధ్య అల్లా మెరుస్తూంది చూడు" అన్నాడతడు. "ఏదోవుంగరంలాగుంది!" అన్నాడు చిన్నతమ్ముడు. ఆమాటలు వినగానే పున్న అక్కడికి పరుగెత్తింది. గూట్లోకిచూసీచూడ్డంలోనే పున్న కెవ్వునకేకవేసి "ఉంగరం! ఉంగరం!" అంటూ కొయ్యబొమ్మలాగు నిలబడిపోయింది. ఆమెముఖం వివర్ణమైపోయి భయంకరంగా మారింది. మాతమ్ములిద్దరూ వుంగరాన్ని పైకితీసుకుని అమ్మదగ్గిరకి తీసుకుపోయారు. ఉంగరాన్ని చూడగానే, అమ్మ ఆశ్చర్యానికి మేరలేదు. "అయ్యో! జగ్గయ్యా! యెంత ఘోరంచేశాం! ఇప్పుడు వుంగరందొరికిన సంతోషంక[illegible] జగ్గయ్యా

కాంతమూ ఎక్కడికిపోయారో తెలియకపోవడమే ఎక్కువవిచారం కలిగిస్తూందికదా! వారికి జరిగిన అన్యాయానికి బదులుగా ఈవుంగరాన్నైనా సరే వారికిచ్చెయ్యడానికి వెనకతియ్యను. కాని వుంగరం గూట్లోకి ఎల్లావెళ్లిందా అనేసందేహం నన్నుబాధిస్తూంది" అని అమ్మ అంది.

అప్పుడు మన ఆదినారాయణ అక్కడేవున్నాడు. మీరు నిర్దోషులైనట్లు రుజువైనందుకు అతని సంతోషానికి మితిలేదు. అమ్మ అన్నమాటవిని ఆదినారాయణ "అమ్మా! నేను చెబుతానువినండి. జగ్గయ్యగాని అతనికుమార్తెగాని వుంగరాన్ని అక్కడదాచివుండరన్నమాట స్పష్టమేకదా! అంతయెత్తుకియెక్కి గూట్లో వుంగరందాచేయడంకంటె అసందర్భంవేరేవుండదు. అదికాక వాళ్లకలాటి అవకాశమేది? పోయిందని తెలిసిన వెంటనే పోలీసులు వాళ్లనిపట్టుకున్నారుకదూ! అది అలాగుండనియ్యండి. ఇహ కాకులున్నాయే మహాఅల్లరి ముండాపక్షులు. ఎక్కడేనా ఏదేనావస్తువు మెరుస్తూకనబడ్డంభయం. నోటితోకరుచుకుపోతాయి. అందుచేత ఒకకాకి ఆవుంగరాన్ని యెత్తుకుపోయి గూట్లోపడేయడమే ముమ్మాటికీ నిశ్చయం. కాని ఒక్కవిషయం మాత్రం నాలోనాకే ఆశ్చర్యంకలిగిస్తూంది. ఏమిటంటారా? ఇన్నిసంవత్సరాలనుంచీ అడవుల్లోపుట్టి పక్షులనీ జంతువులనీ బాగాపరిశీలించిన నాకు పక్షులువుంగరాన్ని దొంగిలించి వుండొచ్చునుకదా అన్నఆలోచన ఇంతకు ముందు కలగకపోవడమే నాకు వింతగావుంది. కాని నామిత్రుడు జగ్గయ్యయును,అతనికుమార్తెయును ఈకఠిన పరీక్షకి నిలవాలని ఆజగత్కర్తఆజ్ఞ కాబోలు?" అని చెప్పేడు.

అప్పుడు మాఅమ్మ ఆదినారాయణతో "అవునోయ్! నువ్వుచెప్పింది నాకు బాగా నచ్చిందిసుమా! కిటికీలోనించి కాకులుతరుచు నాగదిలోకి వొస్తూనేవుంటాయి. ఆవేళ నేను వుంగరంవుంచిన బల్లకిటికీదగ్గరే వున్నట్లు నాకుబాగాజ్ఞాపకమే. కాకులేవుంగరాన్ని ఎత్తుకుపోయాయని చెప్పడంలో నాకే సందేహమూలేదు. మనమెవ్వరమూ కాకులు ఎత్తుకుపోతూన్నప్పుడు చూడకపోవడంచేత ఇంతకర్మంకలిగింది."అన్నది.

మానాన్నగారు మీకు జరిగిన అన్యాయానికి ఎంతో విచారించేరు. కాంతం! ఆయన అన్నమాటలు నీకు చెబతానువిను. "పాపం! ఆఅమాయకులకంత బాధకలిగినందుకు నామనస్సు చాలా కటకటలాడుతూంది. వాళ్లెక్కడున్నారో కనుక్కొని తగినంతఉపకారం చేసేవరకూ నాకు నిద్రపట్టదు."

"పున్న అక్కడే నిలుచునివుంది. దానిమనస్సు మహావేదనపడుతున్నట్లు స్పష్టమవుతూంది. దాన్ని చూసేసరికి మానాన్నకి ఒళ్లుమండుకుపోయింది. "ఛీ! పరమదుర్మార్గురాలా! మాదగ్గిరబతుకుతూ అబద్ధమాడడానికి నీనోరెల్లావచ్చింది? నీమూలాన్నేకదా ఆఅమాయకులన్ని బాధలుపడవలసి వచ్చింది?"అంటూ చెట్టును చూడ్డానికివచ్చి అక్కడేవున్న నౌఖర్లనుచూసి "దీన్నితీసుకుపోయి పోలీసువాళ్లకి అప్పచెప్పండి. దీని ఆస్తి అంతా కోటలో జాగ్రత్తపెట్టండి."అని ఆజ్ఞాపించేరు.

కాంతం! నాన్నగారి కోపంచూసి అక్కడివారంతా హడలిపోయారు. ఎవ్వరుగాని మాట్లాడ్డానికి సాహసించలేదు. అంతకు పూర్వమెన్నడును నాన్నగారు అంతకోపంతోవుండగా యెవ్వరూచూడలేదు. చివరకాయన కోటలోకిపోనిచ్చి అంతా యెవరిఅభిప్రాయాలు వాళ్లుచెప్పడం ప్రారంభించేరు.

ధర్మవరంపూరంతా వుంగరంసంగతి వ్యాపించిపోయినది. ప్రతివాడును నిజానిజాలు కనుక్కోవాలని కోటలోకివొచ్చేరు. నిముషంలోనే ఆస్థలమంతా జనంతోనిండిపోయింది. అందరితోపాటు నిన్నువిచారించి శిక్షించిన న్యాయాధిపతికూడా వొచ్చేడు.

ఈవృత్తాంతమంతావిని అతడుపొందిన మనోవేదన యింతని చెప్పడానికి నాతరంకాదు కాంతం! నేరస్థులయెడల కఠినుడే అయినప్పటికీ గ్రామంలో అంత పెద్దమనిషీ, మర్యాదస్తుడూ లేడనిమ్ము. బహు

1080

నిజాయితీమనిషి అని గ్రామస్థులంతా అతన్నిగురించి చెప్పుకుంటారు. అతని విచారంచూసి అక్కడున్నవా రందరి గుండెలూ నీరైపోయాయి.

అప్పుడతడు "ఎంతఘోరం! ఎంతఘోరం! నిరపరాధులనుశిక్షించడంకంటే భయంకరపాపం వేరేలేదు" అని చుట్టూవున్న ప్రజలనుచూస్తూ నిశ్చలగంభీరస్వరముతో "నేనూ మానవుడినేకదా! ఏతప్పూచెయ్యని న్యాయాధిపతి ఒక్కభగవంతుడే. ఇంతవరకూ వుంగరం యెక్కడవుందో ఆయనకే తెలిసివుండెను. హ్రస్వదృష్టికలమానవులు ధర్మమార్గాన్నే సరియైనవిచారణ చెయ్యలేరు. వారు పొరపాటుపడ్డానికి చాలా అవకాశా లుంటాయి. దురదృష్టవశాత్తు లోకంలో సాధారణంగా సాధుసత్తములకే ఆపదలువొస్తాయి. కాని సర్వేశ్వరుడు శిష్టులనురక్షించి తీరుతాడు. ఈకేసులో నిజానిజాలు బయలుపెట్టడాని కాసర్వేశ్వరయిచ్ఛానుసారం యెన్ని విచిత్రసంఘటనలు జరిగాయోచూడండి. తుపానురావడమూ, చెట్టువొరిగిపోవడమూ, సమయానికి రాజకుటుంబమంతా అక్కడేవుండడమూ అన్నీచిత్రంగా జరిగిపోయాయి. అన్నిటికంటే చిత్రమేమంటే వుంగరం అమాయకులైన పిల్లలకు కనబడడమే. పెద్దవాళ్లెవరికైనా కనబడితే తక్షణం దాచేసివుందురేమో? వుంగరంచూడగానే భయభ్రాంతురాలై పెద్దకేకవేసి అబద్ధపుసాక్ష్యంచెప్పినపున్న 'కాంతం నిర్దోషినుమండీ' అని చెప్పకుండానే చెప్పేసింది."

న్యాయాధిపతిమాటలూ, అతడు వెలిబుచ్చిన విషాదమూ అందరి మనస్సులలోనూ నాటిపోయాయి. ప్రతివాడూ బహుశ్రద్ధాభక్తులతో అతడుచెబుతూవున్నమాటలువింటూ నిలుచున్నాడు. ఆయనచెప్పడం పూర్తి కాగానే ఆమాటలు మననంచేసుకుంటూ అంతాయిళ్లకిపోయారు. ఈమోస్తరుగా మీనిర్దోషిత్వము బయలుపడింది! కాంతం! ఏమిటాలోచిస్తున్నావు?

ఇట్లు మాట్లాడుకొనుచుండగనే వారు జమీందారు సౌధమును సమీపించిరి. —కౌముద.

## లోకంబుజోలెందుకే?

అధికార్ల సూర్యనారాయణరావుగారు

అసమనవనీతమై
కుసుమసుకుమారమై
మిసిమించు నీమేని
పసజూచుకన్నులకు
పసినిమ్మ పండెందుకే?
జానకీ! పసినిమ్మపండెందుకే?

అందంపువలపు తీ
య్యందనంబులనూరు
సుందరాననమున్న
వందురుచునుండునా
చందురుని మోమెందుకే?
జానకీ! చందురుని మోమెందుకే?

ప్రేమప్రగాఢమౌ
మోమునించుకవాంచి
కామితమ్ములగూర్చు
కోమలస్వనమెత్త
కోయిలల గోలెందుకే?
జానకీ! కోయిలలగోలెందుకే?

శ్రీకరంబుగ ప్రణయ
రేఖకల్గాగాను
వాకవలె నీయొడల్
సోకిచిత్తముపోల
లోకంబుజోలెందుకే?
జానకీ! లోకంబుజోలెందుకే?